

రేపు తెరుచుకోనున్న
సాగర్ గేట్లు


నాగార్జున సాగర్ జలాశయంకు జలకళ


584 అడుగులకు చేరిన సాగర్ నీటిమట్టం

584 అడుగులకు చేరిన నీటి మట్టం

పులిచింతలకు నీటి విడుదలకు ఏర్పాట్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్ జలాశయానికి వరద భారీగా వచ్చి చేరుతోంది. జలకళతో సాగర్ నిండుకుండలా దర్శనమిస్తోంది. నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరింది. దీంతో సాగర్ క్రస్టు గేట్లు ఎత్తి పులిచింతలకు నీరు విడుదల చేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన ముహూర్తాన్ని ఖరారు చేసి ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీరు విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు ఇన్‌చార్జి ఎస్ఈ మల్లికార్జునరావు ఆదివారం ప్రకటించారు. ఈ మేరకు తెలంగాణ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో నదీ పరివాహక ప్రాంతంలోని ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

18 ఏళ్ల తర్వాత జూలైలో..

సాధారణంగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో సాగర్ గేట్లను తెరుస్తారు. 2007లో జూలై నెలలో గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఆ తర్వాత అంటే 18 ఏళ్లకు మళ్లీ జూలైలో గేట్లు ఎత్తడం ఇప్పుడే. గత ఏడాది ఆగస్టు 5న క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు.

పోటెత్తుతోన్న వరద..

ఆల్మట్టి నుంచి శ్రీశైలం దాకా అన్ని ప్రాజెక్టులకు వరద కొనసాగుతోంది. అన్ని జలాశయాలు నిండాయి. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో శ్రీశైలం డ్యాంకు వరద పోటెత్తుతోంది. శ్రీశైలం నుంచి సాగర్‌కు 1.20 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. డ్యాం గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు కాగా ఆదివారం 584 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలకు 291 టీఎంసీలకు చేరింది. విద్యుత్ ఉత్పత్తి ద్వారా పులిచింతలకు 28,826 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

శనగ అధరగా

పెరిగిన తెల్ల, ఎర్ర శనగ ధరలు


ధర పెరగడంతో అమ్ముకునేందుకు సిద్ధం అవుతున్న రైతులు


పర్చూరులోని ఓ కోల్డ్ స్టోరేజీలో నిల్వ ఉంచిన శనగలు

శనగ రైతుల నిరీక్షణ ఫలించింది. మూడు నెలల నుంచి కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉన్న పంట బయటకు తీసే సమయం ఆసన్నమైంది. శనగ ధరల్లో ఆశాజనక వృద్ధి కనిపించడం.. అది కూడా సరిగ్గా ఖరీఫ్ పెట్టుబడుల ముందు కావడంతో రైతులకు ఊరట దక్కినట్లయింది. ప్రభుత్వం బర్లీ పొగాకు సాగు చేయవద్దని చెప్పడంతో.. ప్రత్యామ్నాయం వైపు చూస్తున్న కర్షకులను మార్కెట్‌లోని ధరలు శనగ వైపు అరకలెత్తేలా చేశాయి.

- మూడు నెలల నుంచి కోల్డ్ స్టోరీజీల్లోనే పంట
- ఖరీఫ్ పెట్టుబడుల వేళ రైతులకు ఊరట
- బర్లీకి ప్రత్యామ్నాయంగా సాగుకు మొగ్గు

(బాపట్ల, పర్చూరు-ఆంధ్రజ్యోతి):

బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలో శనగ దిగుబడులు దాదాపు 48 వేల టన్నుల వరకు ఉంటాయనేది ఓ అంచనా. ఇందులో 50 శాతం దిగుబడుల సమయంలోనే బహిరంగ మార్కెట్‌కు తరలిపోగా మిగిలిన 50 శాతం పంటను రైతులు నిల్వ చేసుకున్నారు. ఇప్పుడు ధర పెరగడంతో వారిలో సంతోషం వ్యక్తమవుతోంది

బాపట్ల జిల్లాలోని పర్చూరు, అద్దంకి నియోజక వర్గాల్లో శనగ అధికంగా సాగవుతూ ఉంటుంది. రబీ సీజన్‌లో దాదాపు జిల్లాలో 13 వేల హెక్టార్లలో శనగ సాగయ్యిందనేది వ్యవసాయశాఖ లెక్కలు చెబుతున్నాయి. ఇక పల్నాడు జిల్లాలో 3,800 హెక్టార్లు, గుంటూరు జిల్లాలో 2,200 హెక్టార్లలో శనగ సాగు జరిగిందనేది అంచనా. గత రబీని మినహాయిస్తే అంతకు ముందు మూడు జిల్లాల పరిధిలో శనగ సాగు దాదాపు 30 వేల హెక్టార్ల వరకు ఉండేది. అది ఇప్పుడు (మిగతా 6లో)

దశాబ్దం తర్వాత

గడచిన పదేళ్లలో ఎప్పుడూ లేని విధంగా కాక్ -11 (తెల్ల) శనగల రకం కన్నా, జేజే -11 (ఎర్ర) శనగల ధర కాస్త అధికంగా ఉండటం గమనార్హం. వారం క్రితం వరకు క్వింటా రూ.5,700 ఉన్న ఎర్ర శనగలు ప్రస్తుతం క్వింటా రూ.6,300 పెరిగింది. ఇది మరింత పైకి ఎగబాకే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. తెల్ల శనగలు మాత్రం క్వింటా రూ. 6000 నుంచి రూ.6,200 లకు చేరింది. దశాబ్దం క్రితం ఒకసారి కాక్ -11 కన్నా జేజే -11 ధర అధికంగా పెరిగింది. ఎర్ర శనగలతో పోలిస్తే దిగుబడుల విషయంలో తెల్లశనగలు వెనకబడే ఉంటాయి. కానీ, ధర ఆశాజనకంగా ఉండడంతో ఎక్కువ మంది రైతులు తెల్ల శనగ సాగు వైపే మొగ్గు చూపే అవకాశాలు ఉన్నాయి.

పదవులు పొందారు ప్రమాణం మరిచారు

రేపల్లె, కూచినపూడి ఏఎంసీల చైర్‌పర్సన్ల నియామకం


రేపల్లె మార్కెట్ యార్డు


నిజాంపట్నంలో అద్దెభవనంలో కొనసాగుతున్న కూచినపూడి వ్యవసాయ మార్కెట్ యార్డు

◆ మూడు నెలలు దాటినా బాధ్యతలు చేపట్టని వైనం ◆ యార్డుల్లో ఎక్కడ సమస్యలు అక్కడే

రేపల్లె, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏప్రిల్ 4న రేపల్లె,కూచినపూడి అగ్రి కల్చరల్ మార్కెట్ కమిటీలకు (ఏఎంసీ) చైర్మన్లను, డైరెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కానీ, నేటికీ చైర్మన్లు ప్రమాణ స్వీకారం చేసి, బాధ్యతలు చేపట్టలేదు. దీంతో రైతులకు అందాల్సిన సేవలు, వారి సమస్యల పరిష్కారంలో మరింత జాప్యం ఏర్పడుతోంది. రేపల్లె మార్కెట్ యార్డు చైర్మన్‌గా జనసేనకు చెందిన మత్తి అనురాధ, కూచినపూడి మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఓగిబోయిన వెంకట్‌యాదవ్‌ను, డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. యార్డుల పరిధిలోని గోదాముల అభివృద్ధిలో చైర్మన్ల పాత్రే కీలకం.

అధ్వానంగా రేపల్లె గోదాములు

రేపల్లె మార్కెట్ యార్డులో రెండు దశాబ్దాల కిందట నిర్మించిన గోదాముల పైకప్పు రేకులకు పెద్దపెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. నిల్వ ఉంచిన ధాన్యం వర్షపు నీటికి తడిచిపోతోంది. ఈ గోదాములకు గత ప్రభుత్వంలో కనీసం మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవు. చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లి సమీపంలోని గోదాంలో రేపల్లె యార్డుకు సంబంధించిన ధాన్యం నిల్వ ఉంది. ఈ భవనానికి కూడా మరమ్మతులు నిర్వహించాల్సి ఉంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ పూర్తయ్యే నాటికి గోడౌన్‌ల మరమ్మతులు నిర్వహించి, ధాన్యం నిల్వ చేసుకునేందుకు సిద్ధం చేయాలని రైతులు కోరుతున్నారు. ఇవన్నీ జరగాలంటే.. చైర్మన్లు ముందుగా ప్రమాణస్వీకారం చేసి, వాటిపై దృష్టి సారించాల్సి ఉంది.


● అద్దె భవనంలో కూచినపూడి మార్కెట్ యార్డు

కూచినపూడి మార్కెట్ యార్డు అభివృద్ధిని పాలక యంత్రాం గం పట్టించుకోవడం లేదు. ఏళ్ల తరబడి యార్డు అద్దె భవనాల్లోనే కొనసాగుతోంది. కూచినపూడి నియోజకవర్గం రద్దు కాకముందు.. ఇక్కడ మార్కెట్ యార్డును అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసింది. అప్పటి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి, మంత్రులు కాసు కృష్ణారెడ్డి, కన్నా లక్ష్మీనారాయణ, మోపిదేవి వెంకట రమణరావు యార్డును ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వంలో కూచినపూడి యార్డు కార్యాలయాన్ని నిజాంపట్నం తరలించారు. ప్రస్తుతం అక్కడ కూడా అద్దె భవనంలోనే కార్యాలయం కొనసాగుతోంది. దీనికి ఒక గోదాము కూడా లేదు. దీంతో రైతులు పంటను ఎక్కడ దాచుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. చెక్‌పోస్టుల ద్వారా మార్కెట్ యార్డుకు రూ.2 కోట్ల మేర ఆదాయం వస్తోంది. అయితే యార్డుకు స్థల సేకరణ చేసి, గోదాము నిర్మిద్దామన్న ఆలోచన కూడా గత ప్రభుత్వానికి రాలేదు. 2014-19 టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా అనగాని సత్యప్రసాద్ పల్లప ట్ల సమితి భవనాన్ని మార్కెట్ యార్డుగా ఏర్పాటు చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. కానీ, ఫలించ లేదు. అప్పటి నుంచి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా పరిస్థితి మారింది.

పది నెలల్లో రూ.300 కోట్లకుపైగా
దోపిడీ?

- మద్యం విక్రయాల్లో రాబడి తేడాలతో అంచనా
- గత వైసీపీ హయాంలో నాసిరకంలోనూ పిండేశారు
- ప్రస్తుతం కోరుకున్న మద్యం ఉన్నా తగ్గిన ఆదాయం

గుంటూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఊరూ పేరులేని అనామక జే బ్రాండ్లతో వైసీపీ హయాంలో మందుబాబుల ఆరోగ్యం ఒళ్లుగుల్లకాగా, జేబులకు చిల్లుపడింది. పైగా నాసిరకం మందు అమ్మి యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డారు. 2023 సెప్టెంబరు నుంచి 2024 జూన్ వరకు వైసీపీ హయాంలో, 2024 సెప్టెంబరు నుంచి 2025 జూన్ వరకు కూటమి ప్రభుత్వంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో


జగన్ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణం

జరిగిన మద్యం విక్రయాల ఆదాయం చూస్తే జే బ్రాండ్లతో రూ.300 కోట్లకు పైగా దోపిడీ జరిగినట్లు తెలుస్తోంది. నాసిరకం బ్రాందీ, విస్కీ, బీర్లకు వాస్తవ ధరకంటే అధిక ధర నిర్ణయించిన వైసీపీ పాలకులు మందుబాబుల నుంచి దోచుకున్న సొమ్మును సొంత ఖజానాకు చేరవేసుకున్నారని తెలుస్తోంది. సీఎంగా జగన్ ప్రవేశ పెట్టిన ప్రభుత్వ మద్యం దుకాణాల వ్యవస్థను చంద్రబాబు రద్దు చేసిన విషయం తెలిసిందే. పైగా గతంలో వలే కాకుండా ఇప్పుడు కోరుకున్న మద్యం బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చారు. అయితే ఈ నిర్ణయం వల్ల మద్యం వ్యాపారం పెరిగిందే కానీ ప్రభుత్వానికి ఆదాయం తగ్గింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వైసీపీ, కూటమి హయాంలో పది నెలల వ్యవధిలో నాడు, నేడు జరిగిన అమ్మకాలను పోల్చి చూస్తే జగన్ హయాంలో అమ్మింది నాసిరకం మద్యమైనా ఎన్ని కోట్ల దోపిడీ జరిగిందో వెల్లడవుతున్నది. జగన్ హయాంలో 2023 సెప్టెంబరు నుంచి 2024 జూన్ వరకు బ్రాందీ, విస్కీ వంటివి 20 లక్షల 14వేల 423 కేసుల అమ్మకాలు జరిగాయి. భూమ్ భూమ్ వంటి నాసిరకం బీర్లు 5 లక్షల 16వేల 927 కేసుల అమ్మకాలు జరిగాయి. వీటి ద్వారా అప్పటి ప్రభుత్వానికి రూ.1757.31 కోట్లు రాబడి వచ్చింది. అదే చంద్రబాబు హయాంలో 2024 సెప్టెంబరు 2025 జూన్ వరకు బ్రాందీ, విస్కీ వంటివి 23 లక్షల 25 వేల 908 కేసుల అమ్మకాలు జరిగాయి. కింగ్‌ఫిషర్ వంటి నాణ్యమైన బీర్లు 10 లక్షల 51 వేల 306 కేసుల అమ్మకాలు జరిగాయి. ఈ పది నెలల్లో అమ్మకాల్లో 20 శాతం వృద్ధి కనిపించినా వైసీపీ హయాంలో వచ్చినంత రాబడే ఖజానాకు వచ్చింది. వైసీపీ హయాంలోని ధరలతో పోల్చితే రూ2108.77 కోట్లు రావాలి. అయితే కూటమి ప్రభుత్వం ధరలు తగ్గించడంతో అది రూ.1796.93 కోట్లకే పరిమితమైంది. అంటే ఈ పది నెలల్లో జరిగిన లెక్కలు చూస్తే వైసీపీ హయాంలో నాసిరకం మద్యం అమ్మి సుమారు రూ.300 కోట్లు దోచుకున్నట్లు అర్థమవుతోంది. ఈ లెక్కన వైసీపీ హయాంలో ఐదేళ్ల అదనపు ధరలతో జరిగిన దోపిడీ ఎంతనేది చూస్తే ఎవరైనా అమ్మో అనాల్సిందే.

పోలీసుల అదుపులో
జంట హత్య నిందితులు

● ముంబై ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకున్న పోలీసులు

నరసరావుపేట లీగల్, అద్దంకి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు రియల్ వ్యాపారులైన తండ్రీ కొడుకులు వీరాస్వామిరెడ్డి, ప్రశాంత్ రెడ్డి హత్య కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఓ కేసులో కోర్టుకు హాజరయ్యేందుకు బెంగళూరు నుంచి నరసరావుపేటకు వచ్చిన తండ్రీ కుమారుల్ని ఈ నెల 23న కిడ్నాప్ చేసి సంతమాగులూరు మండలం పాతమాగులూరు సమీపంలో హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుల కోసం పోలీసు బృందాలు గాలింపు చేపట్టాయి. కిడ్నాప్ ఘటనను కొందరు న్యాయవాదులు వీడియోలు తీశారు. వాటిని పరిశీలించిన పోలీసులు నిందితులను గుర్తించారన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుల కదలికలు ఎప్పటికప్పుడు పోలీసులు అంచనా వేశారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఐదుగురు నిందితులు ముంబై ఎయిర్‌పోర్టులో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే ఉన్నతాధికారులు రంగంలోకి దిగి హత్య కేసులో ప్రమేయం ఉన్న మొదటి నిందితుడి సహా ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇప్పటికే కేసును నరసరావుపేట స్టేషన్‌కు బదిలీ చేసిన నేపథ్యంలో సోమ, మంగళవారాల్లో నిందితులను అరెస్టు చూపి కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

ఒకరికి రిమాండ్

ఈ కేసులో నిందితుడైన గడ్డం అనిల్‌రెడ్డిని ఆదివారం నరసరావుపేట మొదటి పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. అతడ్ని మొదటి అదనపు జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపరిచారు. అనిల్‌రెడ్డికి ఆగస్టు 7 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి ఏ సలోమి ఉత్తర్వులు జారీ చేశారు. ఐదుగురు నిందితులను ట్రాన్సిట్ వారెంట్‌పై ముంబైలో అదుపులోకి తీసుకున్న పోలీసులు నరసరావుపేటకు తీసుకువస్తున్నట్లు సమాచారం.

గుంటూరోళ్ల మాట కటువు
మనస్సు మంచిది
● రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్
6
ఎంఈఓ పోస్టుల భర్తీకి చర్యలు
● జోన్ 3 పరిధిలో 71 ఖాళీల్లో 35 మందిని నియమించాం

ఉద్యోగులూ ఉపాధి కూలీలే

❖ మల్లాయపాలెంలో బోగస్ మస్టర్ల గుట్టురట్టు ❖ సామాజిక తనిఖీ సభలో అవకతవకల గుర్తింపు



మల్లాయపాలెంలో సామాజిక తనిఖీ గ్రామ సభలో ఉపాధి పనుల వివరాలను వెల్లడిస్తున్న తనిఖీ బృందాలు

బల్లికురవ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కూలీల వలసల నిరోధానికి పెట్టిన ఉపాధి హామీ పథకం అక్రమాలకు నెలవుగా మారింది. సామాజిక తనిఖీల్లో మస్టర్ల మాయ, పనులు చేయకుండానే రికార్డులు, కూలీలు పనికి రాకుండానే చెల్లింపులు తదితర అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. అయితే మండలంలోని మల్లాయపాలెం గ్రామంలో ఏకంగా ఉద్యోగులనే ఉపాధి కూలీలుగా చేర్చి నిధులు మాయం చేసినట్లు వెలుగుచూసింది. గ్రామంలో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ చేపట్టి ఆదివారం గ్రామ సభ నిర్వహించారు. ప్రతి కూలి ఇంటికి వెళ్లి పనులకు వచ్చారా లేదా అని విచారణ చేశారు. ఈ క్రమంలో పనుల్లో పెద్దఎత్తున లోపాలు ఉన్నాయని అధికారుల తనిఖీల్లో గుర్తించారు. గతంలో చేసిన పనులకు రికార్డులు సరిగా లేకపోవడంతో తనిఖీలు చేసిన అధికారులు నిధులు దుర్వినియోగంపై నివేదికలను తయారు చేసి గ్రామసభ ముందు చదివి వినిపించారు. ఉపాధి నిధులు దుర్వినియోగం అయ్యాయని సభలో అధికారులు ప్రకటించారు. గ్రామంలో 61 మందికి అబ్బారెడ్డి బాలకృష్ణ బోగస్ మస్టర్లు వేశాడని, వారిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నట్లు చెప్పారు. అదేవిధంగా గ్రామంలో లేకుండా ఇతర ప్రాంతాల్లో ఉండే విద్యార్థులకు మస్టర్లు వేసి నిధులు కాజేశారని ప్రకటించారు. సభలో ఎస్ఆర్పీ తులసినాయక్, డీఆర్పీ అంజయ్య, ఉపాధి ఇన్‌చార్జి ఏపీవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం


● మంత్రి రవికుమార్, ఎంపీ కృష్ణప్రసాద్ ● చందలూరులో సుపరిపాలనలో తొలిఅడుగు ● ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ.. కళాక్షేత్రం ప్రారంభం

పంగులూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోన్నదని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మండలంలోని చందలూరు గ్రామంలో ఆదివారం సుపరిపాలన - తొలిఅడుగు కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికీ కుళాయి ద్వారా నీరందించేందుకు జలజీవన్ మిషన్ ద్వారా రూ.57 లక్షలతో పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని మంత్రి, ఎంపీ ఆవిష్కరించారు., ఎన్టీఆర్ కళాక్షేత్రాన్ని ప్రారంభించారు.


ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

దిగువకు 7,250 క్యూసెక్కులు

● డెల్టా కాల్వలకు 8,420 క్యూసెక్కులు



ప్రకాశం బ్యారేజి దిగువకు నీరు విడుదల

తాడేపల్లి టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి కొనసాగింది. ఎగువన ప్రధాన వాగులు వజినేపల్లి నుంచి 3,885, కీసర నుంచి 20,129, పాలేరు నుంచి 1,059 క్యూసెక్కులు మొత్తం వరద నీరు 25,073 క్యూసెక్కులు ప్రకాశం బారేజీ రిజర్వాయర్‌కు చేరుతోంది. రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం నమోదు అవగా, 10 గేట్లను ఒక అడుగు మేర ఎత్తి దిగువకు 7,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా డెల్టా కాలువలకు 8,420 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు జేఈ రాజేష్ తెలిపారు.

బ్యాంకు కుంభకోణంపై విచారణ జరిపిస్తాం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



హరిబాబు, లక్ష్మణరెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు

నాదెండ్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన కోట్ల రూపాయల బ్యాంకు కుంభకోణంపై కూటమి ప్రభుత్వం విచారణ జరిపిస్తుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. నాదెండ్ల సహకార సంఘ త్రీమెన్ కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది. చైర్‌పర్సన్‌గా నల్లమోతు హరిబాబు, సభ్యులుగా బత్తుల లక్ష్మణరెడ్డి, చెంచు అంజనేయులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జరిగిన సభలో ముఖ్య అతిథి ఎమ్మెల్యే పుల్లారావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయం, జగన్ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీ కట్టేందుకు, జీతాలకే సరిపోతుందన్నారు. నిమ్మకు నీరెత్తినట్లు ఉన్న కొందరు అధికారుల వ్యవహార శైలి మారాలని ఆయన హితవు పలికారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వేణుబాబు కుటుంబ సభ్యులకు ఇస్కో అందించిన రూ.2 లక్షల బీమా చెక్కును ఎమ్మెల్యే, ఇస్కో సేల్స్ అధికారి లోకేశ్ అందజేశారు. మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ హరగోపాలం, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వర్గ పోరుపై కఠిన నిర్ణయాలు..

నాయకుల మధ్య విభేదాలు, వర్గపోరు, గ్రూపులతో కఠిన నిర్ణయాలు తీసుకుంటానని ఎమ్మెల్యే పుల్లారావు స్పష్టం చేశారు. గ్రామాల అభివృద్ధికి నాయకులంతా ఒకేతాటిపై నిలవాలని, ఆధిపత్య ధోరణిని విడనాడాలని సూచించారు. నియోజక వర్గంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసినా నాయకుల మధ్య విభేదాలు, అనైక్యత వల్లే 2019లో తాను ఓడి పోయానని పేర్కొన్నారు.

గుంటూరోళ్ల మాట కటువు.. మనస్సు మంచిది

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్



కేఎస్ జవహర్ దంపతులను సత్కరిస్తున్న ఆనందబాబు, సంఘాల నాయకులు

గుంటూరు(తూర్పు), జూలై 27(ఆంధ్రజ్యోతి): గుంటూరోళ్ల మాట కాస్త కటువుగానే ఉంటుందని, కానీ, వారి మనస్సు చాల మంచిదని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ పేర్కొన్నారు. ఏసీ కళాశాలలోని సమావేశ మందిరంలో ఆదివారం దళిత ప్రజా సంఘాలు, దళిత ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జవహర్ దంపతులకు ఆత్మీయ, అభినందన సభ జరిగింది. సభకు క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల మ్యానీ అధ్యక్షత వహించారు. జవహర్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ గుంటూరుతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని గుర్తుచేసుకున్నారు. ఏసీ కళాశాలలో చదువుకున్నా నని, అదే కళాశాలలో సన్మానం జరగడం సంతోషంగా ఉంద న్నారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అందించిన ప్రోత్సా హంతోనే ఎస్సీ కమిషన్ పదవి తీసుకున్నానని చెప్పారు. తనను నమ్మి చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్ ఇచ్చిన పదవికి పూర్తి స్థాయిలో న్యాయం చేస్తానన్నారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. దళితుల సంక్షేమానికి 42 ప్రతిపాదనలు పంపిస్తే వాటిని చంద్రబాబు ఆమోదించి, అమలుకు సుమారు 15 జీవోలు తీసుకొచ్చారని గుర్తుచేసుకున్నారు. వైసీపీ పాలనలో ప్రశ్నించిన దళితులకు శిరోముండనాలు, హత్యాకాండలతో ప్రాణాలు బలిగొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీల మీదే అట్రాసిటీ కేసులు పెట్టి చట్టాన్ని, కమిషన్ ప్రతిష్ఠను జగన్ మోహన్‌రెడ్డి సర్వనాశనం చేశారని మండిపడ్డారు. జవహర్ కచ్చితంగా పదవికి వన్నె తెస్తారన్నారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ సమాజం పట్ల అవగాహన కల్గిన వ్యక్తికి కమిషన్ పదవి ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, ఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ విజయ్ శేఖర్, నగర డిప్యూటీ మేయర్ షేక్ సజీల తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఏసీబీకి ఫిర్యాదు చేస్తాం

● నరసరావుపేట రిజిస్ట్రార్ వివరణపై ఆక్షేపణ
● ఇద్దరు సబ్ రిజిస్ట్రార్‌లపై చర్యలు తీసుకోవాల్సిందే
● రూ.40 కోట్ల భూ అక్రమ రిజిస్ట్రేషన్ బాధితుడు కొత్తపల్లి

గుంటూరు సిటీ, జూలై 27(ఆంధ్రజ్యోతి): గుంటూరుకు చెందిన రూ.40 కోట్ల భూమి అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో కొందరు అధికారులు చట్ట ప్రకారం నడుచుకున్నారంటూ నరసరావుపేట జిల్లా రిజిస్ట్రార్ ఇచ్చిన వివరణపై బాధితులు భగ్గుమంటున్నారు. బాధితుడు కొత్తపల్లి శ్రీనివాసరావు రిజిస్ట్రార్ వివరణను ఆక్షేపిస్తూ ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. రిజిస్ట్రేషన్ అధికారుల పాత్ర, ప్రమేయం లేకుండా అక్రమ రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని ప్రశ్నించారు. ఈ విషయంలో తప్పు జరిగిందని చెప్పకనే చెబుతూ కొరిటెపాడు సబ్-రిజిస్ట్రార్‌కు క్లీన్ చిట్ ఇవ్వడం దారుణమన్నారు. ఒకే రోజు ఒకే వ్యక్తి పేరుతో 16 జీపీఏలు జరిగితే వాటిని అడ్డుకోవాల్సిన కొరిటెపాడు సబ్ రిజిస్ట్రార్ అప్రూవల్ ఇవ్వడం చట్ట విరుద్ధం కాదా అని ప్రశ్నించారు. సాధారణంగా రిజిస్ట్రేషన్ కోసం వస్తే ఒరిజినల్ దస్తావేజులు, ఆధార్ కార్డులు, సాక్షులు వంటి వాటిని క్షుణ్ణంగా పరిశీలించే అధికారులు ఈ విషయంలో ఎందుకు నింపాదిగా ఉన్నారన్నారు. ప్రభుత్వ అధికారులకు ల్యాండ్ మాఫియా నుంచి పెద్ద ఎత్తున డబ్బులు ముట్టడం వల్లే ఇదంతా జరిగిందని ఆరోపించారు. నరసరావుపేట రిజిస్ట్రార్ ఆఫీసు కేంద్రంగా జరిగిన ఉదంతంలో అప్పటి జాయింట్ సబ్ రిజిస్ట్రార్ పఠాన్ కరీముల్లా ఖాన్‌తో పాటు ఫేక్ రిజిస్ట్రేషన్ ఆమోదించిన గుంటూరు జిల్లా కొరిటెపాడు సబ్ రిజిస్ట్రార్ ఆదినారాయణరెడ్డిపై తమకు పూర్తి అనుమానాలున్నా యన్నారు. ఈ రిజిస్ట్రేషన్‌లో కీలక భూమిక పోషించిన సీనియర్ అసిస్టెంట్ రత్నరాజు కూడా శిక్షకు పాత్రుడేనని పేర్కొన్నారు. తప్పు చేసిన వ్యక్తులను కాపాడేందుకు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ప్రయత్నిస్తున్నట్లు స్పష్టమవుతోందని కొత్తపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. దీనిపై ఏసీబీ అధికారులను కలిసి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. న్యాయం జరగకపోతే మరోసారి ముఖ్యమంత్రిని, మంత్రి నారా లోకేశ్‌ను, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ను కలిసి ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు. నరసరావుపేట జిల్లా రిజిస్ట్రార్ వెల్లడించిన వివరాలను తాము ఖండిస్తున్నామన్నారు.

దావులూరిపాలెంలో కేరళ బృందం పర్యటన



కొల్లిపర మండలం దావులూరిపాలెంలో పర్యటిస్తున్న కేరళ బృందం

గుంటూరు సిటీ, జూలై 27(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై సంపూర్ణ అవగాహన కోసం నాలుగు రోజుల శిక్షణలో భాగంగా కేరళ బృందం ఆదివారం కొల్లిపర మండలం దావులూరి పాలెంలో పర్యటించింది. ఏపీ సీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి నేతృత్వంలో వివిధ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను బృంద సభ్యులు సందర్శించారు. సీనియర్ కన్సల్టెంట్ రామచంద్ర ప్రకృతి వ్యవసాయంలోని సార్వత్రిక సూత్రాలను కేరళ బృందానికి వివరిం చారు. అనంతరం రైతు వసంత పొలంలోని అరటి ఏ-గ్రేడ్ మోడల్, ఏటీఎం మోడల్‌ను పరిశీలించి, ప్రయోజనాలను వివరించారు. ప్రకృ తి, రసాయన వ్యవసాయ క్షేత్రాల్లో తేడాలను గమనించేందుకు బ్రిక్స్ విలువలను బృందం పరిశీలించింది. ప్రకృతి వ్యవసాయంలో బ్రిక్స్ విలువ 12 శాతం, రసాయన వ్యవసాయంలో 4 శాతంగా నమో దైంది. ఉష్ణోగ్రత కూడా రెండు క్షేత్రాల్లో 31, 36 శాతాలుగా నమో దైనట్లు తెలిపారు. అన్నవరం గ్రామంలో రైతు సాంబయ్య పీఎండీఎస్ (ప్రీ మాన్సూన్ డ్రై సోవింగ్) క్షేత్రం, బొమ్మువారి పాలెంలోని బయో రీసెర్చ్ సెంటర్‌ను సందర్శించారు. చివరగా మహిళా సంఘాల గ్రూపుతో ప్రకృతి వ్యవసాయ భాగస్వామ్యం గురించి చర్చించారు. ఈ పర్యటన ద్వారా కేరళ బృందం ప్రకృతి వ్యవసాయం, పోషకాహార భద్రతపై విలువైన సమాచారాన్ని పొందింది.

పెన్షన్‌దారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం

చొరవ చూపాలి

● ఏపీ పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుచ్చిబాబు



మాట్లాడుతున్న బుచ్చిబాబు, పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు

గుంటూరు(తూర్పు), జూలై 27 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన చట్టాలతో రాష్ట్ర పెన్షన్‌దారులకు సమస్యలు ఎదురవుతున్నాయని, వాటి పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవా లని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ ఇంజనీరింగ్ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియే షన్ రాష్ట్ర అధ్యక్షుడు టీఎంబీ బుచ్చిరాజు కోరారు. గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన అసోసి యేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగిం చారు. వేతన విభజన చట్టాల ముసుగులో జరుగుతున్న వర్గీకరణ మూలంగా విశ్రాంత ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ దారుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రధాన మంత్రికి వినతి పత్రాన్ని పంపేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. 12వ వేతన సవరణ పూర్తి స్థాయిలో అమలు కావాలని, మధ్యంతర భృతి 35 శాతం, 12వ పీఆర్సీలో చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 315 సవరణ ద్వారా భార్యాభర్తలకు కుటుంబ పెన్షన్ వర్తించేలా మార్పులు చేయాలని కోరారు. అమరావతిలో పెన్షన్‌దారుల భవనం నిర్మించాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేట్ ప్రెసిడెంట్ షేక్ రియాజ్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి యా కూర్మారావు, కోశాధికారి బి శివరామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.శ్రీనివాసరావు, ఎంవీ రంగాచారి, వి.వెంకటేశ్వరరావు, వివిధ జిల్లాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అమరావతి మహిళల పోరాటాలతో ఆవేదన

● మహా పాదయాత్రపై దీర్ఘ కవిత పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

గుంటూరు(తూర్పు), జూలై 27(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేట లోని ఎస్‌హెచ్‌వో సమావేశ మందిరంలో డాక్టర్ పట్టాభి కళా పీఠం, విశాఖ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అడపా రామకృష్ణ రచించిన అమరావతి మహిళల మహా పాదయాత్ర దీర్ఘ కవిత పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. సభకు పట్టాభి కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించగా, అఖిలభారత పంచాయతీ పరిషత్(ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకం ఆవిష్కరించారు. బండికల్లు జమదగ్ని స్వాగతం పలకగా, జానీబాషా పుస్తక సమీక్ష చేశారు. జాస్తి వీరాంజనేయులు మాట్లాడు తూ గత ప్రభుత్వం మూడు రాజధానుల అంశం తెర మీదకు తెచ్చి.. రాష్ట్ర ప్రజల మనోభావాలను దెబ్బతీయడమే కాకుండా రాష్ట్రాభి వృద్ధిని అడ్డుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. పుస్తక రచయిత అడపా రామకృష్ణ మాట్లాడుతూ.. తాను విశాఖ వాసినైనా అమరావతి రైతులు, మహిళల పోరాటాల్ని చూసి ఆవేదన చెంది.. పుస్తకం రచించినట్లు చెప్పారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్, సంపాదకుడు శిరేల సన్యాసిరావు, ఉద్యమ కారిణి వంకాయలపాటి శివకుమారి, డాక్టర్ రావి రంగారావు, అమరావతి జేఏసీ మల్లికార్జునరావు తదితరులు ప్రసంగించారు. కవులు సుభాని, తాటికోల పద్మావతి, లలితకుమారి, సుభద్రా కృష్ణ, సత్యవతి, రమణి, భానోజీ బాబు, రాధాకృష్ణమూర్తి, వెంకాయమ్మ పలకలూరి శివరావు తదితరులు పాల్గొని పుస్తక రచయితను ఘనంగా సత్కరించారు.

శనగ అ'ధర'గా..

(5వ పేజీ తరువాయి)

ప్రస్తుతం 19 వేల హెక్టార్లకు పడిపోయింది. చీడపీడల బెడద, ప్రకృతి విపత్తుల కారణాలతో చాలా మంది రైతులు శనగ సాగుకు స్వస్తి చెప్పారు.

మార్క్‌ఫెడ్‌కు క్వింటా కూడా రాలేదు...

గతంలో మార్క్‌ఫెడ్ శనగ మద్దతు ధర రూ.5,650గా నిర్ణయించింది. కానీ, ఒక్క క్వింటా కూడా రైతులు మార్క్‌ఫెడ్‌కు విక్రయించలేదు. నిబంధనల ప్రకారం ఎర్ర శనగను కొనడానికే మార్క్ ఫెడ్‌కు అవకాశం ఉంది. తెల్ల శనగ కొనడానికి వీలు లేదు. ఎర్ర శనగ విషయంలో డీస్టోన్ చేసి అంటే మట్టి పెళ్లలను తొలగించడంతో పాటు శుభ్రం చేసిన వాటినే మార్క్‌ఫెడ్ కొంటుంది. ఇవన్నీ చేయాలంటే రైతుకు క్వింటాకు అదనంగా రూ.600 వరకు ఖర్చయ్యే అవకాశం ఉంది. అంటే మద్దతు ధర నికరంగా అన్నదాతకు చేరేది కేవలం రూ.5,050 కావడంతో రైతులు మార్క్‌ఫెడ్ కొనుగోళ్ల వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ధర కోసం ఎదురుచూడలేని రైతులు రూ.300లు తక్కువకు బయటి మార్కెట్‌లోనే తమ దిగుబడులు అమ్ముకున్నారు. ఆర్థిక వెసులుబాటు ఉన్న రైతులు తమ దిగిబడులను కోల్డ్ స్టోరేజీలో నిల్వ ఉంచుకున్నారు. ప్రస్తుతం పెరిగిన ధర పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంఈఓ పోస్టుల భర్తీకి చర్యలు

● ఆర్జేడీ లింగేశ్వర రెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు(విద్య) జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎంఈఓ పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పాఠశాల విద్య సంయుక్త సంచాలకులు (ఆర్జేడీ) లింగేశ్వర రెడ్డి తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రచురితమైన "ఎంఈఓలు ఏరి" కథనానికి ఆయన స్పందించారు. జోన్-3 పరిధిలో ఇప్పటికే 71 ఖాళీలు ఉండగా 35 మంది ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు (ఎఫ్ఏసీ) బాధ్యతలు అప్పగించినట్లు ఆయన తెలిపారు. మిగిలిన ఖాళీలు త్వరలో భర్తీ చేస్తామని చెప్పారు. ఉపాధ్యాయుల జీతాల బిల్లులు, పర్యవేక్షణ కోసం కొంతమంది ప్రధానోపాధ్యాయులను ఇన్‌చార్జి ఎంఈవోలుగా నియమించినట్లు పేర్కొన్నారు. జోన్-3(గుంటూరు, ప్రకాశం నెల్లూరు)పరిధిలో ఉన్నందున ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం హెచ్‌ఎంను పుల్లల చెరువు, వెల్దుర్తి మండలాలకు (ఎఫ్ఏసీ) ఎంఈఓగా నియమించినట్లు చెప్పారు. త్వరలో ఎంఈఓ 1 పోస్టులు ఉద్యోగోన్నతులు, మరికొన్ని బదిలీల ద్వారా భర్తీ చేయనున్నట్లు ఆర్జేడీ తెలిపారు.

శాసనసభ సదుపాయాల కమిటీలో యరపతినేని

పిడుగురాళ్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి ఏర్పాటు చేసిన వివిధ కమిటీల్లో పలువురు శాసన సభ్యులకు చోటు లభించింది. శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చైర్మన్‌గా ఏర్పాటైన శాసనసభ సదుపాయాల కమిటీలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు చోటు లభించింది.

లే అవుట్‌ల క్రమబద్ధీకరణకు గడువు పొడిగింపు

● జూన్ 30లోపు రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లకు మాత్రమే

సత్తెనపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అనధికార లే అవుట్‌లలోని ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ గడువును పొడిగిస్తూ జీవో నంబరు 134 ప్రభుత్వం శనివారం విడుదల చేసింది. ఈ జీవో ప్రకారం 2025 జూన్ 30 లోపు రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లకు మాత్రమే క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తారు. భూమి విలువ, పరిమాణం స్థానిక సబ్ రిజిస్ట్రార్ సమాచారం ఆధారంగా ప్రాథమిక, వాస్తవ జరిమానా చార్జీలు వసూలు చేస్తారు. ఓపెన్ స్పేస్ అందుబాటులో లేని పక్షంలో ప్లాట్ విలువపై 14 శాతం అదనపు చార్జీని విధిస్తారు.

41ఏ నోటీసులు ఇవ్వకుండా అరెస్టు చేయాలి



ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాలమహానాడు నాయకులు

నరసరావుపేట టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో 41ఏ నోటీసులు ఇచ్చే విధానాన్ని తొలగించి, దానిని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ కోరారు. గుంటూరు పట్టణంలోని ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.శామ్యూల్ జవహర్ అభినందన సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జాన్‌పాల్ ఆయనకు అభినందనలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో 41ఏ నోటీసులు ఇవ్వకుండా నిందితులను అరెస్ట్ చేయాలని కోరారు. 22ఏ నిషేధిత జాబితా నుంచి భూముల తొలగింపులో అధికారుల నిర్లక్ష్యంపై కమిషన్ ఉక్కుపాదం మోపాలని పేర్కొన్నారు. మాలమహానాడు నరసరావుపేట అధ్యక్షుడు జయరావు తదితరులు పాల్గొన్నారు.

తురకా కిశోర్‌పై హత్యాయత్నం కేసు

మాచర్ల రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అనుచరుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిశోర్‌పై విజయపురిసౌత్ పోలీస్‌స్టేషన్లో ఆదివారం హత్యాయత్నం కేసు నమోదైంది. 2023లో వార్డు మెంబర్‌గా పోటీ చేస్తున్న తనపై తురకా కిశోర్, బూడిద శ్రీను, మరి కొంతమంది హత్యాయత్నం చేసినట్లు మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన గుండెబోయిన శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వివాహిత ఆత్మహత్య

బాపట్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అద్దెకుంటూ హోటల్‌లో పని చేస్తున్న మీసాల సత్యవేణి (30) అనే వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ ఆర్.రాంబాబు ఆదివారం తెలిపారు. వివరాల మేరకు.. నర్సీపట్నంకు చెందిన సత్యవేణికి చీరాలకు చెందిన కాంతారావుతో వివాహమైంది. బాపట్లలోనే నివాసం ఉంటూ.. ఓ హోటల్‌లో పనిచేస్తూ వీరు జీవనం సాగిస్తున్నారు. అయితే ఉన్నట్లుండి సత్యవేణి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కేఎల్‌యూలో నూతన విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో ప్రసంగిస్తున్న కేఎల్‌యూ వీసీ సారథివర్మ

తాడేపల్లి (వడ్డేశ్వరం), జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ ఒక మహా అద్భుతమని, ఎన్నెన్నో ఆవిష్కరణల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని కేఎల్‌యూ ఉపకులపతి డాక్టర్ సారథివర్మ పేర్కొన్నారు. సృజనాత్మక ఆలోచన, కార్యాచరణ ప్రణాళిక ద్వారా గొప్ప ఇంజనీర్లుగా రాణించవచ్చని ఆయన సూచించారు. నూతన విద్యా సంవత్సరంలో కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కోర్సులు తీసుకున్న విద్యార్థుల సమ్మేళన అవగాహన కార్యక్రమాన్ని తాడేపల్లి మండలం వడ్డేశ్వరం గ్రామంలోని కేఎల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన వేలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. మూడు దశాబ్దాలుగా ఇంజనీరింగ్ రంగంలో వచ్చిన ప్రగతి, ఇంజనీరింగ్ కోర్సులు, వాటి ప్రత్యేకతలు విద్యార్థులు ఎలా ప్రణాళికాబద్ధంగా నేర్చుకోవాలి, నైపుణ్యాలు ఎలా సాధించాలి అనే విషయాలను ఆయన వివరించారు. తల్లిదండ్రులు ఆశయాల సాధనతోపాటు విద్యార్థులు అత్యున్నత స్థాయికి వెళ్లాలంటే క్రమశిక్షణ నైపుణ్యం చాలా ముఖ్యమన్నారు. యూనివర్సిటీలోని మౌలిక వసతులు, ఏర్పాట్ల పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ కె రాజశేఖరరావు, డీన్‌లు డాక్టర్ శ్రీనాథ్, కృష్ణారెడ్డి, ఏఆర్ఎస్ ప్రసాద్, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు మాట్లాడారు.

హోంగార్డు అభ్యర్థులకు వీఐటీలో పరీక్షలు

తుళ్లూరు,(ఐనవోలు) జూలై 27(ఆంధ్రజ్యోతి): సీఐడీ టెక్నికల్ వింగ్ లో హోంగార్డుల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఐనవోలు పరిధిలోని వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ)ఏపీ యూనివర్సిటీలో ఆన్‌లైన్ విధానంలో ఆదివారం పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం 28 పోస్టులకు 5,657 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. బ్యాచ్‌ల వారీగా సోమ, మంగళ వారాల్లో కూడా పరీక్షలు జరగనున్నాయి. సీఐడీ డీజీ రవిశంకరు అయ్య న్నార్ ఆధ్వర్యంలో టెక్నికల్ వింగ్ అడ్మిన్ ఉమా మహేశ్వరావు పరీక్షలను పర్యవేక్షిస్తున్నారు. ఉదయం 6 నుంచి సాయంత్ర 5 గంటల వరకు జరగాల్సిన పరీక్షలు తొలిరోజు సర్వర్ సమస్య కారణంగా సాయంత్రం 8 గంటల వరకు నిర్వహించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

మరోసారి అదే దుకాణంలో పట్టుబడ్డ ప్లాస్టిక్



శ్రీలక్ష్మీ వేంకటేశ్వరట్రేడర్స్‌లో మరోసారి లభించిన ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌లు పరిశీలిస్తున్న అధికారులు

బాపట్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణ నడిబొడ్డున జీబీసీరోడ్డు పక్కనే అధికారులు అనేకసార్లు దాడులు చేసి సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను పెద్దఎత్తున పట్టుకుంటున్నప్పటికి సదరు వ్యాపారి విక్రయాలు ఆపటం లేదు. శనివారం మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించి పోస్టాఫీస్ ఎదురు ఉన్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వరట్రేడర్స్‌కు సంబంధించిన గోదాములో 5 టన్నుల 650 కిలోల ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకొని జిందాల్ కంపెనీకి తరలించారు. ఆదివారం శానిటరి అధికారులు తనిఖీలు చేస్తుండగా అదే షాపులో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయిస్తున్నట్లు తెలుసుకొని వెళ్ళగా వ్యాపారులు వాగ్వాదానికి దిగారు. ప్రతిసారి మాషాపే దొరికిందా అంటూ షట్టర్‌లు వేసే ప్రయత్నం చేయగా అధికారులు ముందుభాగం తనిఖీ చేసి అక్కడ ఉన్న 40 కిలోల ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇంకా ఉన్నాయని సోమవారం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి విస్తృత తనిఖీ చేసి అవసరమైతే షాపు సీజ్ చేస్తామని శానిటరి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కరుణ తెలిపారు. శానిటరి ఇన్‌స్పెక్టర్ సయ్యద్ నజీర్, వార్డుసెక్రటరీలు, మేస్త్రీలు పాల్గొన్నారు.

గుండె సంబంధిత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

బాపట్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ముఖ్యంగా గుండెకు సంబంధించి ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలని ప్రముఖ గుండె వైద్యనిపుణులు, పీవీ ప్రజ్ఞ హార్ట్‌కేర్ హాస్పటల్ వైద్యనిపుణులు డాక్టర్ పి.శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని విజయలక్ష్మీపురం లిటిల్‌ఏంజెల్స్ స్కూల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ బి.మంజువాణిలు రోగులను పరీక్షించి అవసరమైన మందులు పంపిణీ చేసి కౌన్సెలింగ్ ఇచ్చారు. బీపీ, షుగర్‌ని అదుపులో ఉంచుకోవాలని అదుపు తప్పితే గుండెపోటు, పక్షవాతం వచ్చే అవకాశం ఉందన్నారు. నిర్వాహకులు కార్తీక్, రావినూతల శ్రీనివాసరావు, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

బగళాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు

పిట్టలవానిపాలెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవస్థానంలో శ్రావణమాసం సందర్భంగా తొలి ఆదివారం వివిధ గ్రామాలకు, ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, మొక్కుబడులు తీర్చుకున్నారని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు.

విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాలు పంపిణీ

బాపట్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శారాఫెయిత్ ఫౌండేషన్‌లో ఉంటున్న అనాథ విద్యార్థులకు మున్సిపల్ హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు డాక్టర్ తుళ్ళూరి వెంకటేశ్వర్లు ఆదివారం స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థులు ఆంగ్లంలో చక్కగా రాణించాలని, దీనికి పుస్తకాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. అదేవిధంగా శారాఫెయిత్ ఫౌండేషన్‌కు బియ్యం, బ్యాగ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు జాషువా తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : వేగేశన

● అప్పికట్ల సొసైటీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

బాపట్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తున్నదని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండలంలోని అప్పికట్ల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడిగా ఆచంట విజయ్‌కుమార్, డైరెక్టర్‌లుగా కోటేశ్వరరావు, కాలేషాలతో ప్రమాణస్వీకారం చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సమస్యలపై తక్షణమే స్పందించి వాటిని పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు, మాజీ సర్పంచ్ ఇనగంటి గాంధీ, భర్తీపూడి సర్పంచ్ ఆచంట అమరేష్, జనసేన నాయకులు విన్నకోట సురేష్, నామన వెంకటశివన్నారాయణ, గుంటుపల్లి తులసీకుమారి, సంధ్యారాణి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

ఐటీ నిపుణులను నేరగాళ్ళుగా మార్చిన లిక్కర్ స్కామ్ : కొల్లా

బాపట్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : జగన్ జమానాలో దేశంలోనే అత్యంత పెద్ద లిక్కర్ స్కామ్‌గా వేల కోట్ల అవినీతికి అనవాలంగా నిలిచి సీఎంవోలోని ఉన్నత ఉద్యోగులతోపాటు బంగారు భవిష్యత్తు కోసం కలలు కన్న ఎందరో ఐటి నిపుణులను ఉద్యోగాల పేరిట లిక్కర్‌స్కామ్‌లో ఇరికించి నేరగాళ్ళగా మార్చటం దుర్మార్గమని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. ఈ విషయమై ఆదివారం ఆయన మాట్లాడుతూ అసలు లిక్కర్ స్కామ్ అనేది జరగలేదని, ఇది రాజకీయ కక్ష సాధింపుల కోసం చంద్రబాబు సర్కార్ సృష్టించిన కల్పిత బేతాళ కథ అంటూ జగన్‌తోపాటు వైసీపీ నాయకులు గగ్గోలు పెట్టి నమ్మించాలనుకోవటం సిగ్గుచేటు అన్నారు.

ఆర్ అండ్ బీ రహదారులపై గుంతలు

● రోడ్డు కింద పగిలిన పైపులైను
● పట్టించుకోని అధికారులు

వేమూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేమూరు నుంచి వరహాపురం మీదుగా కుచ్చెళ్లపాడు వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డులో రెండు ప్రాంతాల్లో ఏడాది క్రితం పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వేమూరు సమీపంలోని రైసుమిల్లు ప్రాంతంలో ఒక చోట, కుచ్చెళ్లపాడు గ్రామ శివారులో ఒక చోట గుంతలు ఏర్పడ్డాయి. గుంతలు పడ్డ ప్రాంతంలో రోడ్డు కింద మురుగునీటి ప్రవాహం కోసం ఏర్పాటు చేసిన తూములు కూడా పగిలిపోయాయి. దీంతో మురుగునీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడింది. ఆ ప్రాంతాల్లో ఎప్పుడూ ఎలాంటి ప్రమాదం జరుగుతుందోననే భయంతో రైతులు ఆ గుంతల్లో దుంగలు వేసి పూడ్చారు. అయినప్పటికీ ఆ ప్రాంతాలు ప్రమాద సూచికలుగా మారాయి. ఖరీఫ్ సాగు ప్రారంభమైన దశలో మురుగునీటి ప్రవాహానికి ఇబ్బంది బాగా ఏర్పడింది. ఆర్ అండ్ బీ శాఖ నిర్లక్ష్య వైఖరిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తపరుస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి పగిలిన పైపుల స్థానంలో కొత్త పైపులు ఏర్పాటు చేసి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని రైతులు, ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

అలాగే మండలంలోని చదలవాడ నుంచి కాకర్లమూడి మీదుగా కుచ్చెళ్లపాడు వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. మూడున్నర కి.మీ దూరం కలిగిన ఈ రోడ్డులో కాకర్లమూడి-కుచ్చెళ్లపాడు-చదలవాడ గ్రామాలకు చెందిన రైతుల భూములు ఉన్నాయి. రోడ్డు పూర్తిగా దెబ్బతినడం వల్ల రైతులతో పాటు ఈ గ్రామాలకు వెళ్లే ప్రజలు కనీసం ఆటోలు కూడా తిరగని కారణంగా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి నిధులు కేటాయింపుతో పాటు రోడ్డు మార్గాన్ని బాగుపరచాలని కోరుతున్నారు.



కుచ్చెళ్లపాడు వద్ద ఆర్ అండ్ బీ రోడ్డుపై పడ్డ గుంత



వరహాపురం ఆర్ అండ్ బీ రోడ్డు మార్గంలో గుంత



దెబ్బతిన్న చదలవాడ-కాకర్లమూడి రోడ్డు

విలువలకు ప్రతీక ఏపీజే అబ్దుల్ కలాం

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



ఏపీజే అబ్దుల్‌కలాం విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ తదితర నాయకులు

బాపట్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : విలువలకు ప్రతీకగా నిలిచిన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం చిరస్మరణీయులని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమాన్ని జీబీసీ రోడ్డులోని తవ్వకాల్వ వద్ద ఆయన విగ్రహం దగ్గర ఆదివారం నిర్వహించారు. పార్టీశ్రేణులతో కలిసి కలాం విగ్రహానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాలలో దేశప్రతిష్ఠతను ఇనుమడింప చేసి భారతరక్షణ రంగ బలోపేతానికి కృషి చేసిన ఆధునిక క్షిపణి పితామహుడు అబ్దుల్‌కలాం అని అన్నారు. అపరమేధావి, నిగర్వి, నిరాడంబరుడైన అబ్దుల్ కలాంను స్మరించుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా ఆయన పేరుగడించారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నామన వెంకటశివన్నారాయణ, విన్నకోట సురేష్, అబ్దుల్‌కలాం ఫౌండేషన్ ఛైర్మన్ పఠాన్ రాజేష్, జిట్టా శ్రీనివాసరావు, బీమా లీలాకృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాం సేవలు నిరుపమానమైనవి : కోన



అబ్దుల్ కలాం విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న కోన రఘుపతి తదితర నాయకులు

దేశ రక్షణ రంగ సార్వభౌమత్వ సాధనలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం పాత్ర అద్వితీయమైనదని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమాన్ని జీబీసీరోడ్డులోని ఆయన విగ్రహం వద్ద పార్టీశ్రేణులతో కలిసి ఆదివారం నిర్వహించారు. ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో కోన రఘుపతి మాట్లాడుతూ క్షిపణి శాస్త్రవేత్తగా అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు నిరుపమానమైనవని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి, పట్టణపార్టీ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, నాయకులు చల్లా రామయ్య, చింతల రాజశేఖర్, ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, వెంకట్రావు, బుల్లిరెడ్డి, రమేష్, సీకే నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో...

మాజీ రాష్ట్రపతి భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమాన్ని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. జీబీసీ రోడ్డులో కలాం విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను కొనియాడారు. దేశ రక్షణ రంగానికి కలాం చేసిన సేవలు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దాసరి ఏసుబాబు, పిట్టలవానిపాలెం మండల అధ్యక్షుడు హుస్సేన్‌బాబు, సయ్యద్ అన్సారీ, సత్యనారాయణ, చల్లాపల్లి ఏసోబు, షేక్ జహీర్‌బాషా, షేక్ రఫీ, జహీర్ జానీ, జిడుగు రాజేష్, సంజయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో...

మాజీ రాష్ట్రపతి దివంగత డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా పేరుపొందారని మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు అన్నారు. జీబీసీరోడ్డులోని కలాం విగ్రహానికి సంఘనాయకులతో కలిసి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో సాంబశివరావు మాట్లాడుతూ దేశ రక్షణ రంగానికి అబ్దుల్ కలాం చేసిన సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఛైర్మన్ పఠాన్ రాజేష్, మాజీ సైనిక సంక్షేమ సంఘం బాపట్ల అధ్యక్షుడు పుట్టా ఆదిశేషారెడ్డి, సెక్రటరి పీటా సారధి, సుంకర శేషగిరిరావు, కె.అంజనేయులు, పసుపులేటి ప్రసాద్, పి.రాధాకృష్ణమూర్తి, డి.వెంకటేశ్వర్లు, అడే కిషోర్ పాల్గొన్నారు.

ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో...

మాజీ రాష్ట్రపతి భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం యువతకు చూపిన మార్గదర్శకత్వం అద్భుతమైనదని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ.సాయిబాబు అన్నారు. అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల విద్యావనరుల కేంద్రం వద్ద కలాం విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను కొనియాడారు. విలువలకు ప్రతీకగా నిలిచిన అబ్దుల్ కలాం అడుగుజాడలలో ప్రతిఒక్కరు పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో రియల్‌ఎస్టేట్ ఏజెంట్‌ల సంఘం అధ్యక్షుడు బొట్టు కృష్ణ, యాసిన్, నాగేంద్రప్రసాద్, నర్రా శ్రీనివాసరావు, మున్నా బాబు, సురేష్, బాలకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో...

మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జీబీసీ రోడ్డులోని కలాం విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బ్రహ్మాండం బాలనారాయణ, సీనియర్ నాయకులు బి.బాబునాగేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు మామిడి రమేష్ కుమార్, మువ్వల శ్రీనివాస్, టి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో...

యువతలో విజయకాంక్షను రగిల్చిన మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపిజె అబ్దుల్‌కలాం ఆదర్శణీయులని బాపట్ల రోటరీ క్లబ్ అధ్యక్షులు వేజండ్ల శ్రీనివాసరావు అన్నారు. అబ్దుల్‌కలాం వర్ధంతిని రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జీబీసీరోడ్డులోని కలాం విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి కొత్త ఆంజనేయ వరప్రసాద్, కోశాధికారి కొత్త సుబ్బారావు, సీనియర్ సభ్యులు ఇ.హరిబాబు, జిట్టా శ్రీనివాసరావు, శ్రీమన్నారాయణ ఎం.సుధీర్‌కుమార్, ఎల్‌పి. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా అబ్దుల్ కలాం ఫౌండేషన్ కార్యాలయంలో, తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న అబ్దుల్ కలాం విగ్రహానికి ఫౌండేషన్ సభ్యులు, కూటమి నాయకులు తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్‌బాషా, టీడీపీ గ్రామ అధ్యక్షుడు షేక్ బాజి, బాపట్ల మార్కెట్ యార్డు డైరెక్టర్ పఠాన్ కరిముల్లా, ఇబ్రహీం, జానీబాషా, రియాజ్‌బేగ్, బహదూర్ బాషా, హైదరాబాద్ వలి, ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

మినీ లారీ బోల్తా

కర్లపాలెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పాత పెట్రోల్ బంక్ సమీపంలో జాతీయ రహదారిపై మినీలారీ టైర్ పంచర్ కావడంతో బోల్తాపడింది. వివరాల్లోకి వెళితే... భీమవరం నుంచి రొయ్యల లోడుతో ఒంగోలు వైపు వెళుతున్న ఈ మినీ లారీ టైర్ పంచరై బోల్తా పడగా రొయ్యల ట్రేలు రోడ్డుమీద పడిపోవటంతో మరొక లారీని పిలిపించి అందులోకి మార్చుకున్నట్లు యజమానులు తెలిపారు. లారీ బోల్తా పడిన సంఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలియజేశారు.

ఘనంగా నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం



నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న బి.బాబునాగేంద్ర

బాపట్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : బావపురి రియల్ ఎస్టేట్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం బాపట్ల ఎన్జీవో హోమ్‌లో ఘనంగా నిర్వహించారు. నూతన కార్యవర్గంతో సీనియర్ నాయకుడు బి.బాబునాగేంద్ర ప్రమాణస్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా తోట కృష్ణమూర్తి (బొట్టు కృష్ణ), ఉపాధ్యక్షుడిగా నర్రా శ్రీనివాసరావు, కార్యదర్శిగా మొవ్వా రమేష్‌బాబు, జాయింట్ సెక్రటరిగా ఎస్‌కే సుభానీ, కోశాధికారిగా ఒంగోలు రత్తయ్య, గౌరవాధ్యక్షులుగా టి.శ్రీనివాసరావులతోపాటు సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. కొనుగోలుదారుల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని పని చేస్తామని వారు పేర్కొన్నారు.

మత్స్యకారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

● సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి

బాపట్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ పునర్నిర్మాణంలో మత్స్యకారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి తెలిపారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల జిల్లా కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యదర్శి టి.కృష్ణమోహన్ అధ్యక్షతన జిల్లా సమావేశం నిర్వహించారు. సమావేశానికి రమాదేవి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో నల్లబర్లి పొగాకు కొనుగోలు విషయంలో పేదరైతు, కౌలురైతులకు ప్రాధాన్యతనిచ్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిని, ప్రజాసమస్యలను పూర్తిగా గాలికివదిలేసి కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వభూములు చౌకగా కట్టబెట్టటం సరికాదన్నారు. స్మార్ట్‌మీటర్‌లు రద్దు చేయాలని, పెంచిన విద్యుత్‌ఛార్జీలు తగ్గించాలని ఆగస్టు 5వ తేదీన విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఆండా మాల్యాద్రి, జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య, టి.కృష్ణమోహన్, సీహెచ్‌మజుందార్, ఎన్.బాబురావు, సీహెచ్ మణిలాల్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో యోగా

బాపట్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూర్యలంక నగర వనంలో ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఛైర్మన్ డాక్టర్ బి.శరత్‌బోస్ సభ్యులతో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటి వరకు నిర్వహించిన కార్యక్రమాలు, భవిష్యత్తులో జరగాల్సిన కార్యక్రమాలు గురించి కార్యదర్శి గురజాల శ్రీనివాసరావు వివరించారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి చెన్నంశెట్టి కేశవులు, జోత్స్న దేవి, షబీరా, పూర్ణ, వంకాయలపాటి హరిబాబు, పంగులూరి హరిబాబు, అల్లాడి రవికుమార్, మోదడుగు సూరిబాబు, కోలా సుబ్బారావు, తోట రామాంజనేయులు, జీవీఎల్ మోహన్‌గౌడ్ తదితరులు పాలొన్నారు.

నేడు రెండు మండలాల్లో 'సుపరిపాలన తొలి అడుగు'

భట్టిప్రోలు, కొల్లూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : కొల్లూరు మండల పరిధిలోని కిష్కిందపాలెం గ్రామంలో సోమవారం ఉదయం మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొని ప్రారంభించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు షైనేని మురళీకృష్ణ పేర్కొన్నారు. అనంతరం భట్టిప్రోలు మండలంలో సాయంత్రం 3 గంటలకు ఉద్యాన శాఖ , అజంత సోయా లిమిటెడ్‌ను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ కార్యక్రమం, ఐలవరం చేనేత కార్మికులకు వర్క్‌షెడ్స్ చెక్కుల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొంటారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా కోరారు.

టైప్ పరీక్షలకు 54 మంది హాజరు

రేపల్లె, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : టైప్ పరీక్షలు విద్యార్థినీ, విద్యార్థుల ఉద్యోగావకాశాలకు దోహదపడుతుందని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.చంద్రశేఖర్ అన్నారు. పాలిటెక్నికల్ కళాశాలలో ఆదివారం టైప్ రైటింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంగ్లీషు లోయర్ 30 మంది, హయ్యర్ 15 మంది, జూనియర్ గ్రేడ్ ఏడుగురు, తెలుగు హయ్యర్ ఒక్కరు, లోయర్ ఒక్కరు, మొత్తం 54 మంది విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో డేవిడ్‌రాజు, చంద్రశేఖర్, సీవీ మోహన్‌రావు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి : శివప్రసాద్

నిజాంపట్నం(రేపల్లె), జూలై 27 (ఆంధ్రజ్యోతి) : తీరప్రాంతంలోని రైతులకు మెరుగైన సేవలు అందించి వారికి అండగా నిలవాలని అనగాని శివప్రసాద్ అన్నారు. నిజాంపట్నం మండలం కూచినపూడి పీఏసీఎస్ అధ్యక్షుడిగా దాసరి వెంకటేశ్వరరావు, డైరెక్టర్ల ప్రమాణస్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతం అంతా రైతులు అధికంగా జీవనోపాధి సాగిస్తున్నారని, సహకార సంఘం ద్వారా రైతులకు ఎరువులు, సబ్సిడీల ద్వారా రుణాలు అందించి వారిని ఆదుకోవాలని సూచించారు. అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో మంత్రి అనగాని సత్యప్రసాద్ ఈ పదవి కట్టబెట్టటం ద్వారా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కేసన పమిడియ్య, పొలగం వెంకట్రావు, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, చెరుకుపల్లి మండల పార్టీ అధ్యక్షుడు తాతా ఏడుకొండలు, బొమ్మిడి రామకృష్ణ, మద్రాస్ సాంబశివరావు, కేసన రామకృష్ణ, కొలసాని రాము, నల్లపాటి యల్లయ్య పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేసిన దాసరి వెంకటేశ్వరరావును అభినందిస్తున్న అనగాని శివప్రసాద్

చేనేత కార్మికులకు వర్క్ షెడ్ల బకాయి విడుదల

చెరుకుపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : చేనేత కార్మికులకు మగ్గంషెడ్ల నిర్మాణం కోసం కనగాల, రాజవోలు, చెరుకుపల్లి, గుళ్ళపల్లి గ్రామాలలో ఉన్న చేనేత కార్మికులు 29 మందికి రెండో విడత బకాయిలు విడుదల చేశారు. ఒక్కొక్క షెడ్డుకి లక్షా ఇరవై వేల చొప్పున మంజూరు చేయగా దాని తాలూకా బకాయిలు రూ.17,40,000 చెక్కులు రాజవోలు చేనేత సహకార సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బాపట్ల జిల్లా ఏడీ రఘనంద చేనేత కార్మికులకు అందజేశారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దివి రాంబాబు మాట్లాడుతూ రెండో విడత బకాయిలు రావడానికి సహకరించిన రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌కి, చేనేత జౌళి శాఖా మంత్రి సవితకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాజవోలు చేనేత సహకార సంఘం అధ్యక్షుడు గొర్రె రమేష్, ఏడీవో వెంకట్రావు, రాజవోలు సర్పంచ్ తుళ్ళూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 27 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పి.నాగాంజనేయులు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్ల పేరుతో అదాని కంపెనీ ప్రజలను ఆర్థిక దోపిడి చేసేందుకు ప్రభుత్వం బాటలు వేస్తుందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సీపీఐ నాయకులు గొట్టుముక్కల బాలాజీ, బండారు శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ నాయకులు విష్ణుమొలకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవత కొలుపులు

అమృతలూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామ దేవత శ్రీ శ్రీతల పుట్టలమ్మ తల్లి, అంకమ్మతల్లికి ఆదివారం ఘనంగా కొలుపులు జరిపారు. గ్రామం వెలుపల ఉన్న కాల్వ నుంచి జలమును తీసుకువచ్చి గ్రామ దేవతకు అభిషేకం చేశారు. రజకులు చాట్రగడ్డ వారి ఆడపడుచుకు జాతర నిర్వహించారు. భక్తులు, మహిళలు మొక్కుబడులు చెల్లించారు. కనక తప్పెట్లుతో గ్రామోత్సవం జరిపారు.

అమ్మవారికి ఆషాఢం సారె సమర్పణ

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం భట్టిప్రోలు అద్దేపల్లి గ్రామాలకు చెందిన ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి ఆషాఢం సారె సమర్పించారు. గ్రామ దేవత శ్రీదండి పార్వతి అమ్మవారికి సారెను ఆదివారం సమర్పించారు. ఉదయం 9 గంటలకు పూజా సామాగ్రితో గ్రామోత్సవం మేళతాళాలతో నిర్వహించి అమ్మవారి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా, శుక్ర వారోత్సవ కమిటీ నిర్వాహకురాలు బూరెల అరుణకుమారి పర్యవేక్షించారు. మాటూరు గృహలక్ష్మి, తూనుగుంట్ల లక్ష్మీపార్వతి, మద్దుల నళిని పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అమృతలూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : చుండూరు మండల పరిధిలోని చినపరిమి, మండూరు, ఆలపాడు, కారుమూరువారిపాలెం, చినగాదెలవర్రు, పెదగాదెలవర్రు, ఆరమండపేటలో విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని ఏఈ ఆదివారం తెలిపారు.


దిక్సూచి

సైబర్ సెక్యూరిటీ & సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఐఐటీ బాంబే సర్టిఫికెట్ ప్రోగ్రామ్

సైబర్ సెక్యూరిటీ & సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌పై ఐఐటీ బాంబే ప్రొఫెషనల్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. పన్నెండు నెలల ఈ కోర్సును పూర్తిగా ఆన్‌లైన్‌లో అందిస్తున్నారు. పరీక్షలు ఐఐటీ క్యాంపస్‌లో నిర్వహిస్తారు. ఇది పూర్తిగా వర్కింగ్ ప్రొఫెషనల్స్, కాలేజీ ఫ్యాకల్టీలతోపాటు ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులను ఉద్దేశించి రూపొందించారు. 2025 సెప్టెంబర్ 1 నుంచి కోర్సు ప్రారంభం కానుంది. పూర్తి వివరాల కోసం ఐఐటీ బాంబే వెబ్‌సైట్ చూడవచ్చు.

ఐబీపీఎస్ పీవో, ఎస్ఓ దరఖాస్తుల గడువు జూలై 28

ప్రొబెషనరీ ఆఫీసర్, స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల దరఖాస్తు దాఖలు గడువును ఐబీపీఎస్ పొడిగించింది. ఆసక్తిగల అభ్యర్థులు 2025 జూలై 28లోపు ibps.in. వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.



ఎన్ఐఆర్‌డీలో పీజీ డిప్లొమా

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ & పంచాయతీ రాజ్(ఎన్ఐఆర్‌డీపీఆర్)లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ట్రైబల్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్(పీజీడీటీడీఎమ్), ప్రోగ్రామ్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి దూరవిద్యలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతున్నారు. మొత్తం మూడు సెమిస్టర్లు ఉంటాయి. మూడో సెమిస్టర్ పూర్తిగా ప్రాజెక్ట్ వర్క్ ఉంటుంది.

కోర్సు కాలవ్యవధి: 18 నెలలు

అర్హత: గుర్తింపు పొందిన వర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ పాసై ఉండాలి.

కోర్సు ఫీజు: రూ.18,200/-(ఎస్సీ/ఎస్టీలకు ఫీజులో కొంత మేరకు మినహాయింపు ఉంటుంది)

దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 31

ఫోన్: 040 24008442, 7416860345,

Email: dec.nird@gov.in.

వెబ్‌సైట్: www.nirdpr.org.in

మ్యాట్ 2025 సెప్టెంబర్ సీజన్

సీబీటీ & పీబీటీ రిజిస్ట్రేషన్లు ప్రారంభం

ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ 'మ్యాట్ 2025' సెప్టెంబర్ సీజన్ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. జాతీయ స్థాయిలో మేనేజ్‌మెంట్ కోర్సుల్లో అడ్మిషన్లకు ఉద్దేశించిన ప్రధాన ఎంట్రెన్స్‌ల్లో 'ద మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్'(మ్యాట్) ఒకటి. ఈ ఎంట్రెన్స్‌ను 1988 నుంచి నిర్వహిస్తున్నారు. 2003 నుంచి కేంద్ర విద్యామంత్రిత్వశాఖ దీనిని జాతీయ స్థాయి పరీక్షగా గుర్తించింది. ఇది పేపర్ బేస్డ్ టెస్ట్(పీబీటీ), కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) మోడల్‌లో ఉంటుంది. ప్రస్తుతం ఈ రెండు మోడల్స్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్లు ప్రారంభం అయ్యాయి. అభ్యర్థులు తమ సౌకర్యాన్ని, ఆసక్తినిబట్టి ఈ రెంటిలో ఒకటి కానీ, రెంటినీ కానీ ఎంచుకోవచ్చు. మ్యాట్ స్కోరు వ్యాలిడిటీ ఒక సంవత్సరం ఉంటుంది. దేశవ్యాప్తంగా 600 పైగా బిజినెస్ స్కూల్స్ ఈ స్కోరు ద్వారా అడ్మిషన్ కల్పిస్తాయి. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. గ్రాడ్యుయేషన్ చివరి సంవత్సరం ఉన్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేయవచ్చు. అయితే కౌన్సెలింగ్ సమయంలోపు సర్టిఫికెట్‌ను సమర్పించాల్సి ఉంటుంది.

పరీక్ష విధానం: మ్యాట్ ఎంట్రెన్స్ నిర్ణీత సమయం రెండు గంటలు. ఇందులో ఐదు సెక్షన్లు ఉంటాయి. ప్రతీ సెక్షన్‌లో ముప్పై ప్రశ్నలు అంటే మొత్తం 150 ప్రశ్నలు ఉంటాయి. ఈ ఎంట్రెన్స్‌లో నెగెటివ్ మార్కింగ్ ఉంది. తప్పుగా గుర్తించిన ప్రతీ సమాధానికి పావు మార్కు తగ్గిస్తారు.

- లాంగ్వేజ్ కాంప్రహెన్షన్ 30
- ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్ 30
- మేథమెటికల్ స్కిల్స్ 30
- డేటా అనాలిసిస్ అండ్ సఫిసియన్సీ 30
- ఎకనామిక్ అండ్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ 30

పీబీటీ ఎగ్జామ్

- పరీక్ష తేదీ: 2025 సెప్టెంబర్ 21
- రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 15
- హాల్ టికెట్ల విడుదల: 2025 సెప్టెంబర్ 18


సీబీటీ ఎగ్జామ్

- పరీక్ష తేదీ: 2025 సెప్టెంబర్ 28
- రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 22
- హాల్ టికెట్ల విడుదల: 2025 సెప్టెంబర్ 25

ఫీజు: పీబీటీ లేదా సీబీటీల్లో ఏదో ఒకటే రాయాలనుకున్న అభ్యర్థులకు దరఖాస్తు ఫీజు రూ.2200/-. రెండు ఎంట్రెన్స్‌లు రాయాలనుకున్న అభ్యర్థులు అదనంగా రూ.1600/- చెల్లించాల్సి ఉంటుంది.

ఫలితాలు: 2025 అక్టోబర్ రెండోవారంలో విడుదల చేస్తారు.

వెబ్‌సైట్: mat.aima.in



ఆల్ ఇండియా లా ఎంట్రెన్స్ టెస్ట్ 2026

'ఆల్ ఇండియా లా ఎంట్రెన్స్ టెస్ట్ - 2026' నోటిఫికేషన్‌ను ఢిల్లీలోని 'ద నేషనల్ లా యూనివర్సిటీ' విడుదల చేసింది. ఐదు సంవత్సరాల బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్, బ్యాచిలర్ ఆఫ్ లా(బీఏ ఎల్ఎల్‌బీ)(ఆనర్స్), ఒక సంవత్సరం మాస్టర్ ఆఫ్ లా(ఎల్ఎల్ఎం) ప్రోగ్రామ్‌లకు సంబంధించిన ఈ ఎంట్రెన్స్ పరీక్ష 2025 డిసెంబర్ 14న జరుగుతుంది. ఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీలో అడ్మిషన్ కోసం ఏఐఎల్ఈటీ స్కోరును మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. ('క్లాట్, 'ఎల్‌శాట్'తో ఇక్కడ అడ్మిషన్ లభించదు).

విద్యార్హత: ఐదు సంవత్సరాల కోర్సుకు దరఖాస్తు చేయాలనుకునే అభ్యర్థులు కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్‌మీడియేట్ పూర్తి చేసి ఉండాలి. ఓబీసీలకు 42, ఎస్సీ/ఎస్టీలకు 40 శాతం మార్కులు ఉంటే సరిపోతుంది.

వయస్సు: ఏఐఎల్ఈటీ ప్రోగ్రామ్‌లో చేరడానికి ఎలాంటి గరిష్ఠ, కనిష్ఠ వయస్సు నిబంధనలు లేవు.

పరీక్ష విధానం: మొత్తం మూడు సెక్షన్లతో 150 మార్కులు, 150 ప్రశ్నలతో ప్రశ్నపత్రం ఉంటుంది. నిర్ణీత సమయం రెండు గంటలు. ఇందులో నెగిటివ్ మార్కింగ్ ఉంటుంది. తప్పుగా గుర్తించిన ప్రతీ సమాధానానికి 0.25 మార్కులు తగ్గిస్తారు.

సెక్షన్ ఏ: ఇంగ్లిష్ లాంగ్వేజ్ - 50 మార్కులు - 50 ప్రశ్నలు

సెక్షన్ బి: కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ - 30 మార్కులు - 30 ప్రశ్నలు

సెక్షన్ సి: లాజికల్ రీజనింగ్ - 70 మార్కులు - 70 ప్రశ్నలు

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు 3500/-. ఎస్సీ/ఎస్టీ, ఆర్థికంగా వెనకబడిన అభ్యర్థులకు 1500/-. 2025 ఆగస్ట్ 7 నుంచి 2025 నవంబర్ 10లోపు ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు ఏఐఎల్‌టీఈ 2026 కోసం nationallawuniversitydelhi.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చు. ఎంట్రెన్స్ పరీక్ష కేంద్రాలు తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విశాఖపట్నంలో ఉన్నాయి.

చిరునామా: National Law University, Delhi, Sector-14, Dwaraka, New Delhi - 110078, India, 011- 40787555
(10:00 am to 05:00 pm on all working days)
ailetsupport@nludelhi.ac.in

ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ఏపీ ఫారెస్ట్ సబార్డినేట్ సర్వీస్‌లోని 100 ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. 2025 ఆగస్ట్ 17 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. రాత పరీక్ష, శారీరక పరీక్ష, సీపీటీ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉన్నవారికి బోనస్ మార్కులు ఉంటాయి.

పోస్టు: ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్(ఎఫ్ఎస్ఓ). మొత్తం 100 పోస్టులు ఉన్నాయి.

వయస్సు: 2025 జూలై 1 నాటికి 18 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్లను అనుసరించి వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.

అర్హత: పోస్టులను అనుసరించి డిగ్రీ ఉండాలి. (బోటనీ, ఫారెస్ట్రీ, హార్టికల్చర్, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్, స్టాటిస్టిక్స్, జియాలజీ, కెమికల్, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్)

శారీరక ప్రమాణాలు:

పురుషులు: కనీసం 163 సెంటీమీటర్ల ఎత్తు ఉండాలి. ఛాతి 84 సెంటీ మీటర్లు ఉండాలి. గాలి పీల్చినప్పుడు కనీసం ఐదు సెంటీమీటర్లు పెరగాలి.

స్త్రీలు: కనీసం 150 సెంటీ మీటర్ల ఎత్తు ఉండాలి. ఛాతి 79 సెంటీమీటర్లు ఉండాలి. గాలి పీల్చినప్పుడు 5 సెంటీ మీటర్లు పెరగాలి.

నడక: పురుషులు నాలుగు గంటల్లో 25 కిలో మీటర్లు నడవాలి. మహిళలు 16 కిలో మీటర్లు నడవాలి.

చివరి తేదీ: 2025 ఆగస్ట్ 17 **వెబ్‌సైట్:** portalpsc.ap.gov.in/

SCHOLARSHIP ALERT

Aspire Scholarship Program

Description: Aspire Scholarship Program 2025-26 is a CSR initiative of SWAYAM Charitable Trust, a not-for-profit organization set up by Mr. Ajai Chowdhry and his family. The scholarship aims to provide financial support to underprivileged students pursuing B.Tech courses at 11 prestigious engineering institutions across India.

Eligibility: Students joining the first year of B.Tech courses at any of the specified 11 institutions can apply.

- The annual family income of the applicants should not exceed INR 6 lakh from all sources.

Prizes & Rewards: A total of 28 beneficiaries will be awarded scholarships based on the actual fee structure.

- The scholarship fund will be provided for academic expenses such as tuition fees, hostel fees, food, and related expenses.
- The duration of the scholarship will be 4 years, subject to meeting the specified criteria for yearly renewal.

Last Date to Apply: 31-08-2025

Application: Online Only ***Short Url:*** www.b4s.in/aj/ASPI4

HDFC Bank Parivartan's ECSS Programme

Description: HDFC Bank invites applications from students in Classes 1 to postgraduate level for the ECSS Scholarship 2025-26. This program supports meritorious and underprivileged students from financially challenged backgrounds.

Eligibility: Open to Indian nationals only

- Students in Classes 1–12, diploma, ITI, polytechnic, undergraduate, and postgraduate (general and professional) courses
- Minimum 55% marks in the last qualifying exam
- Annual family income must be INR 2.5 lakh or less
- Preference for students who have faced personal or family crises in the past three years, affecting their ability to continue education

Prizes & Rewards: Up to INR 75,000 ***Last Date:*** 04-09-2025

Application: Online only ***Short Url:*** www.b4s.in/aj/HDFC57

buddy4study.com



చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

'మైసా'గా రష్మిక



రష్మిక మందన్న కొత్త చిత్రం 'మైసా' ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సినిమాతో రవీంద్ర పుల్లె దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. నిర్మాత డి.సురేశ్ బాబు క్లాప్ కొట్టారు. రవి కిరణ్ కోలా కెమెరా స్విచ్ఛాన్ చేశారు. దర్శకుడు హను రాఘవపూడి స్ర్కిప్ట్‌ను మేకర్స్‌కి అందజేసి, ముహూర్తపు షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. రష్మిక 'మైసా' అనే శక్తిమంతమైన, హీరోయిన్ ఓరియెంటెడ్ పాత్రలో కనిపించబోతున్నారు. కాగా, గోండు తెగల బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకోనున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ సోమవారం నుంచి హైదరాబాద్‌లో ప్రారంభమవుతుందని, మొదటి షెడ్యూల్‌లో రష్మిక పాల్గొంటుందని చిత్రబృందం పేర్కొంది.

ఉత్కంఠభరిత చిత్రం



సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో అభినయ కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమా 'కామాఖ్య'. పూజా కార్యక్రమాలతో ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. మై ఫిల్మ్ ప్రొడక్షన్స్ బేనర్‌పై వడ్డేపల్లి శ్రీ వాణీనాథ్, యశ్వంత్ రాజ్ నిర్మిస్తున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టారు. చిత్ర దర్శకుడు అభినయ కృష్ణ ఈ సినిమా కోసం ఉత్కంఠభరితమైన కథని సిద్ధం చేశారని మేకర్స్ తెలిపారు. ఆనంద్, శరణ్య, ప్రదీప్, వైష్ణవ్, ధన్‌రాజ్, రాఘవ, ఐశ్వర్య తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

కొత్త పాత్రలో..



వరుణ్ సందేశ్ హీరోగా ఏ.పళని స్వామి తెరకెక్కించనున్న 'వన్ వే టికెట్' అనే సినిమా పూజా కార్యక్రమాలతో ఆదివారం ప్రారంభమైంది. బొరిగే శ్రీనివాస రావు నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో నిర్మాత సి.కల్యాణ్, దర్శకుడు త్రినాధరావు నక్కిన, సంగీత దర్శకుడు సాయి కార్తిక్, నటి కుష్బూ చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మాట్లాడుతూ 'ఈ స్ర్కిప్ట్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. నేను ఇందులో కొత్త పాత్రను పోషించబోతున్నాను' అని అన్నారు. చిత్ర దర్శకుడు పళని స్వామి మాట్లాడుతూ 'ఈ సినిమా క్రైమ్ థ్రిల్లర్‌గా రాబోతోంది' అని తెలిపారు. ఈ చిత్రానికి కెమెరామెన్: శ్రీనివాస్ బెజుగమ్, సంగీతం: సాయి కార్తీక్.





అవీ..ఇవీ..

విశ్రాంత ఆర్మీ ఉద్యోగులకు సత్కారం



విశ్రాంత సైనికులను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

మార్టూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కార్గిల్ దివాస్ సందర్భంగా శనివారం రాత్రి మార్టూరులో ఎఫర్ట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నలుగురు విశ్రాంత ఆర్మీ ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగులైన కే.రూబెన్, పత్తిపాటి హనుమంతరావు, కళ్లం నరేంద్రకుమార్ రెడ్డి,బాచిన వెంకట రామారావులను రోటరీ సభ్యులు శాలువాకప్పి, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సమయంలో నలుగురు ఉద్యోగులు తమ అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో మాదాల సాంబశివరావు, ఇంటూరి ఆంజనేయులు, రావి అంకమ్మచౌదరి, కొర్రపాటి కాజారావు,చెన్నుపాటి బసవరాములు,చెరుకూరి నాగేశ్వరరావు, గోనుగుంట్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెంకట రామారావుకు అభినందన

చినగంజాం, జూలై 27(ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామానికి చెందిన మార్కాపురం వెంకటరామారావు పర్చూరు నియోజకవర్గ వైసీపీ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల విభాగం అధ్యక్షులుగా నియమింతులయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని పెదగంజాం గ్రామంలో వైసీపీ మండల అధ్యక్షులు మున్నం వెంకటనాగేశ్వరరెడ్డి ఛాంబర్‌లో ఆదివారం వెంకట రామారావును ఘనంగా సన్మానించారు. నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మండల వైసీపీ నాయకులు నియోజకవర్గ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల విభాగం అధ్యక్షులుగా నియమితులైన వెంకటరామారావును సన్మానించారు. కార్యక్రమంలో వైసీపీ మండల ఉపాధ్యక్షులు మేడికొండ సునీల్, కార్యదర్శి ఆసోది సూరినారాయణరెడ్డి, అగ్నికుల క్షత్రియ మాజీ డైరెక్టర్ కొల్లాటి ఏడుకొండలు, నాయకులు ఉమామహేశ్వరరెడ్డి, అమరా శ్రీనివాసులు, వాటుపల్లి రాములు, పఠాన్ సైదా, శ్రీరాములురెడ్డిలు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి



అబ్దుల్‌కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముస్లిం నాయకులు

చినగంజాం, జూలై 27(ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని మసీదుపేటలో మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం వర్ధంతి కార్యక్రమాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మసీదుపేటలో ముస్లిం నాయకులు అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను నాయకులు కొనియాడారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని నడవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఐఎం మండల అధ్యక్షులు పఠాన్ సుభానిఖాన్, చినగంజాం గ్రామ అధ్యక్షులు షేక్ ఈసుబ్, ముస్లిం నాయకులు ఎండీ. జియావుల్ హుక్, పఠాన్ బాబు, షేక్ షాహుల్, షేక్ ఇమ్రాన్, షేక్ సాదిక్, షేక్ నాగుర్ బాలజీ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ఫణీంద్రబాబు

అద్దంకి, జూలై27 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఉచితంగా వైద్యసహాయం అందించడం అభినందనీయమని టీడీపీ జిల్లా వైద్యవిభాగం అధ్యక్షుడు, రోటరీ క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఫణీంద్రబాబు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఆదివారం అద్దంకిలోని భవానిసెంటర్‌లో రేణింగవరం రోడ్డులో అహ్మద్ స్పెషాలిటీ క్లినిక్‌లో ఒంగోలుకు చెందిన చైతన్య కార్డియాక్ సెంటర్, స్మార్ట్ విజన్ ఐ హాస్పటల్ వైద్యులు ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 120 మంది రోగులకు ఉచిత పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. సాధారణ వ్యాధులకు కూడా పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్య క్రమంలో వైద్యులు డాక్టర్ కర్నాటి రాహుల్‌రెడ్డి, డాక్టర్ విష్ణు ప్రియ, రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్ష, కార్యదర్శులు పూర్ణచంద్రరావు, హరి ప్రసాద్, షేక్ ఖాజావలి, దేవపాలన, రామకోటేశ్వరరావు, అంజాద్‌బాషా, లేవి ప్రసాద్, చిన్ని మురళీకృష్ణ, చప్పిడి వీరయ్య, తమ్మన శ్రీనివాసరావు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంస్థ ఏర్పాటు అభినందనీయం

- నూర్‌బాషా యువజన సంఘం అధ్యక్షుడు పెద్దమస్తాన్



సమావేశమైన నూతన కమిటీ

అద్దంకి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నూర్‌బాషా దూదేకుల అభివృద్ధికి ఆర్థిక సంస్థ ఏర్పాటు అభినందనీయం అని రాష్ట్ర నూర్‌బాషా యువజన సంఘం అధ్యక్షుడు దూదేకుల పెద్దమస్తాన్ అన్నారు. అద్దంకి పట్టణ దూదేకుల సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం స్థానిక షాధీఖానాలో నిర్వహించారు. అధ్యక్షుడిగా షేక్ మదీనాను ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు. రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడిగా కొటికలపూడి శ్రీను, అద్దంకి యూత్ అధ్యక్షుడిగా ఎలిల్ సాహెబ్, ప్రధాన కార్యదర్శిగా షేక్ సైదావలి, కె.మీరావలి, ఉపాధ్యక్షులుగా అహ్మద్, అంజయ్య, గౌరవ అధ్యక్షుడు గా వేల్పూరి మస్తాన్‌వలిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్య క్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దూదేకుల దావూద్, ఉపాధ్యక్షుడు అజీజ్, సర్ఫరాజ్, అహ్మద్, సుభాని పాల్గొన్నారు.

ట్రైనీ ఎస్సైగా వెంకటేశ్వరరెడ్డి

అద్దంకి,జూలై27(ఆంధ్రజ్యోతి): అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ట్రైనీ ఎస్సై గా వెంకటేశ్వరరెడ్డి శనివారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. సీఐ సుబ్బరాజును కలిసి బాధ్యతలు స్వీకరించారు.

ప్రతి కుటుంబానికి లబ్ధిచేకూరేలా సంక్షేమ పథకాలు

- సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి రవికుమార్, ఎంపీ కృష్ణప్రసాద్
- చందలూరులో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభానికి హాజరైన నేతలు



ఎన్‌టీఆర్ కళాక్షేత్రాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి రవికుమార్, పక్కన ఎంపీ కృష్ణప్రసాద్

పంగులూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని చందలూరు గ్రామంలో ఆదివారం సుపరిపాలన - తొలిఅడుగు కార్యక్రమంలో ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. తల్లికివందనంతో పాటు పింఛన్లు, వంటగ్యాస్ సిలిండర్లు ఏ మేరకు అందాయో అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీ ప్రజలు తాగునీరు అందడం లేదని, నివేశన స్థలాలు లేక ఇబ్బంది పడుతున్నామని మంత్రి రవికుమార్‌కు సమ స్యలను వివరించారు. గ్రామంలో ఇంటింటికీ కుళాయి ద్వారా నీరందించేందుకు జలజీవన్ మిషన్‌ద్వారా రూ.57 లక్షలతో పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపడు తున్నట్లు తెలిపారు. కాలనీ వాసులకు నివేశన స్థలాల సమస్య త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు క్రమం తప్పకుండా చేపట్టాలని పంచాయితీ కార్యదర్శిని ఆదేశించారు.

ఎన్‌టీఆర్ విగ్రహం, కళావేదిక ప్రారంభం

అనంతరం గ్రామంలోని రామాలయం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్‌టీఆర్ విగ్రహన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్‌లు స్థానిక నేతలతో కలసి ఆవిష్కరించారు. కళావేదికను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ గ్రామంలో రూ.30 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు నిర్మించామన్నారు. రూ.35 లక్షల వ్యయంతో పాఠశాల విద్యార్థులకు భోజనశాల నిర్మిస్తున్నామన్నారు. చందలూరు నుంచి గంగవరం వరకు రూ.2 కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో బీటీ రోడ్డు నిర్మాణ పునులు చేపడుతున్నట్లు తెలిపారు. ఆర్‌డీఎస్‌ఎస్ పథకం ద్వారా మెరుగైన విద్యుత్ సరఫరా కోసం రూ.1.50 కోట్లతో విద్యుత్ లైన్లను ఆధునికీకరించామన్నారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కేంద్రం సహకారంతో సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రగతికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రూ.10 లక్షల వ్యయంతో గ్రామానికి చెందిన పెంట్యాల సుబ్బారావు ఎన్‌టీఆర్. విగ్రహం ఏర్పాటుతో పాటు కళావేదిక నిర్మించడాన్ని మంత్రి రవికుమార్, ఎంపీ కృష్ణప్రసాద్‌లు అభినందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెంట్యాల వెంకటకృష్ణారావు, తహసీల్దార్ సింగారావు, డిప్యూటీ ఎంపీడీవో సుమంత్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కేవీ. సుబ్బారావు, పెంట్యాల రాధాకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీదర్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షులు రావూరి రమేష్, కుక్కపల్లి ఏడుకొండలు, డీసీ అధ్యక్షుడు కుక్కపల్లి ఆంజనేయులు, ఎంపీటీసీ సభ్యులు వాసవి, మురకొండ సుబ్బారావు, పెంట్యాల వెంకటేశ్వర్లు, గొట్టిపాటి వెంకటరత్నం, రావూరి సుబ్బారావు, చింతల సహదేవుడు, గుర్రం ఆదిశేఖర్, ఓబుల్‌రెడ్డి, ఆదిరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల ద్వారా మెరుగైన సేవలు

గ్రామంలోని ప్రాథమిక సహకార వ్యవసాయ పరపతి సంఘం ద్వారా రైతాంగానికి మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని చందలూరు గ్రామ పీఏసీఎస్ అధ్యక్షుడిగా అధ్యక్షునిగా నియమితులైన బెల్లంకొండ శ్రీధర్‌బాబు, సభ్యులు వట్టెం శేషయ్య, మాగులూరు సుబ్బారావులతో ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు.

భోజనశాల నిర్మాణానికి భూమి పూజ

పంగులూరు: మండలంలోని చందలూరు ఉన్నత పాఠశాలలో భోజనశాల భవన నిర్మాణానికి ఎంపీ కృష్ణప్రసాద్ ఆదివారం భూమిపూజ చేశారు. పాఠశాల విద్యార్థులు సౌకర్యం కోసం భోజశాల నిర్మాణానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ రూ.35 లక్షల జడ్పీ నిధులు మంజూరు చేయించారు. ఈ భూమిపూజ కార్యక్రమంలో పీఆర్ ఏఈ హనుమంతరావు, హెచ్‌ఎం గిరిజ, అజిత్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ, మురకొండ సుబ్బారావు, అడ్డగడ సుబ్బయ్య, పి.డి. మధు, ప్రతిమ పాల్గొన్నారు.

దివ్యాంగులకు స్కూటీల పంపిణి

పంగులూరు : మండలంలోని పలు గ్రామాల లోని దివ్యాంగులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌లు స్కూటీలను పంపిణీ చేశారు. మండలంలోని ముప్పవరం, కశ్యాపురం, బైటమంజులూరు, పంగు లూరు, చందలూరు, భగవాన్‌రాజుపాలెం, అలవలపాడు గ్రామాలకు చెందిన పదిమంది దివ్యాంగులకు స్కూటీలను అందచేశారు. ఏపీఎస్‌పీసీఎల్ అసిస్ట్ సహకారంతో రూ. 13 లక్షల విలువైన స్కూటీలను లబ్దిదారులకు అందజేశారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

చిల్లచెట్లతో నిండిన వెంపరాల మేజర్

- నీటి ప్రవాహానికి పలుచోట్ల అడ్డంకులు



మేజర్ కాలువలో పెరిగిన చిల్లచెట్లు

అద్దంకి, జూలై 27(ఆంధ్రజ్యోతి): సాగార్ కాలువ పరిధిలో వెంపరాల మేజర్‌లో నీటి ప్రవాహనికి తిప్పలు తప్పడం లేదు. రెండు దశాబ్దాల క్రితం సాగర్ ఆయకట్టులో ఆధునికీకరణ పనులలో భాగంగా ఈ మేజర్ కాలువకు సిమెంట్ లైనింగ్ పనులు చేపట్టారు. ఆ తరువాత కొద్దో గొప్పో మరమ్మతులు మినహా ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. దీంతో కాలువ పలుచోట్ల దెబ్బతిని నీటి ప్రవాహంలో అవరోధాలు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెద్దఎత్తున నిధులు కేటాయించి మేజర్ కాలువలతో పాటు మైనర్ కాలువలకు మరమ్మతులు చేపట్టారు. అయితే కొన్నిచోట్ల అర్థాంతరంగా వదిలేసిన పనులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించారు. ప్రస్తుతం సాగర్ డ్యామ్ వద్ద కుడి కాలువకు నీటి విడుదల జరిగిన నేపథ్యంలో త్వరలో ఆయకట్టుకు నీటి విడుదల చేసే అవకాశం ఉంది. దీంతో పనులు చేయ కుండా వదిలివేసిన చోట వెంటనే పూర్తి చేయకపోతే నీటి ప్రవాహనికి అడ్డంకిగా మారే ప్రమాదం ఉంది. ప్రధానంగా వెంపరాల మేజర్ కాలువలో సుమారు అర కిలోమీటర్ దూరం కనీసం చిల్ల చెట్లు తొలగింపు, పూడికతీత పనులు చేయకుండా వదిలేశారు. అదే సమయంలో వెంప రాల కొండ నుంచి విజయవాడ- బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు గ్రావెల్ తరలింపునకు వెంపరాల మేజర్ కాలువలో తూములు ఏర్పాటు చేశారు. అయితే భారీ వాహనాల రాకపోకలతో తూములు పగలడం, తూముల వద్ద మట్టితో పూడిపోవడంతో నీటి ప్రవాహ నికి అడ్డంకిగా మారే అవకాశం ఉంది. అసంపూర్తి పనులు పూర్తి చేయకపోతే చివరి ఆయకట్టుకు నీటి కష్టాలు తప్పవని రైతులు ఆందోళన చెందు తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంపరాల మేజర్‌లో అసంపూర్తిగా నిలిచి పోయిన పనులు వెంటనే పూర్తి చేసేవిధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

డ్రాయింగ్, పెయింటింగ్‌పై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

మేదరమెట్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : దైవాలరావూరులోని కిరణ్‌జ్యోతి రిసెర్చ్ ఫౌండేషన్‌లో 12 ఏళ్లలోపు విద్యార్థులకు డ్రాయిగ్, పెయింటింగ్‌లో శిక్షణ శిబిరం నిర్వహించారు. ఆదివారం 45 మంది విద్యార్థులకు డ్రాయింగ్ పెయింటింగ్‌లో మెళకువలను రిటైర్డ్ డ్రాయింగ్ ఉపాధ్యాయుడు మఠం వీరాంజనేయులు, తాత్కాలిక ఉపాధ్యాయుడు వేగూరి ప్రదీప్‌కుమార్‌లు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. బాల్యం నుంచే డ్రాయింగ్ పేయింటింగ్‌లో విద్యార్థులు శిక్షణ తీసుకోవడం ద్వారా ఉన్నత విద్యలో ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. మానసిక ఒత్తిడిని అధిగమించడానికి కూడా డ్రాయింగ్ పేయింటింగ్ ఒక వ్యపకంగా ఉపకరిస్తుందన్నారు. శిక్షణ ఇచ్చిన వీరాంజనేయులు, ప్రదీప్‌కుమార్‌లకు సర్పంచ్ కోనూరి సీతామహాలక్ష్మి, రావిపాటి పెద్దవెంకట సుబ్బయ్య దంపతుల చేతుల మీదగా జ్ఞాపికలు అందజేశారు. ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడిందని విద్యార్థుల తల్లిదండ్రులు హర్షంవ్యక్తం చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

యద్దనపూడి, (మార్టూరు) జూలై 27 (ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలంలోని పూనూరులో జీకేఅండ్ఎంకే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో కాటూరి మెడికల్ ఆస్పత్రివారి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేషమైన స్పందన లభించింది. 1950వ సంవత్సరంలో పూనూరు జడ్పీ హైస్కూల్‌ను స్థాపించారు. దీంతో ప్రస్తుతానికి 75 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఆదివారం పూర్వ విద్యార్థులు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ వైద్య శిబిరానికి వచ్చిన గ్రామస్థులకు కాటూరి ఆస్పత్రి వారు 8 విభాగాలకు సంబంధించి రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. కొంతమందికి షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. గుండె, లివర్, తదితర పరీక్షల కోసం ఆస్పత్రి వారు రూ.కోటి వ్యయంతో కొనుగోలు చేసిన మొబైల్ వాన్ లో రోగులకు పూర్తిగా బాడీ స్కానింగ్ పరీక్షలను వైద్యులు చేశారు. ఈశిబిరంలో హాస్పిటల్ హెడ్ దేవరసాయి శ్రీసన హాస్పిటల్‌కు చెందిన వివిధ విభాగాలకు చెందిన, వైద్యులు సౌమ్య, విద్యాధర్, వేదవ్యాస్, భాగ్యశ్రీ, పూజిత, ఆస్పత్రి ఇన్‌చార్జ్ రామకృష్ణ తదితరులు రోగులకు పరీక్షలు చేశారు. అదేవిదంగా కార్యక్రమాలను పూర్వ విద్యార్థులు మేదూరి కృష్ణవేణి, గన్నమనేని కృష్ణవేణి,దీవి భావనాచార్యులు,ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస రావు,ఆ రే శ్రీనివాసరెడ్డి,ఈదల అనిల్, స్కూలుకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు గ్రామస్థులు పాల్గొన్నారు.

బుర్లవారిపాలెంలో తాగునీటి ఇక్కట్లు

- మౌలిక వసతులు కూడా లేక అవస్థలు
- తమ గోడు పట్టించుకోవాలని వినతి



బుర్లవారిపాలెం వ్యూ

బుర్లవారిపాలెం(చీరాల), జూలై 27 : చీరాల పరిధిలో బుర్లవారిపాలెంవాసులకు తాగు నీరు లేక గొంతెండుతుంది. గ్రామంలో దాదాపుగా అందరూ నిరుపేద కుటుంబీకులే. ఇదిలా ఉంటే పంచాయతీ పాలకులు గతంలో అధికారులు గ్రామంలో ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేశారు. అదికూడా కొద్దికాలం అరకొరగానే నడిచింది. ప్రస్తుతం పూర్తిగా మరమ్మతులకు గురై మూలనపడింది. దీంతో ప్రజలు ప్రయివేటు వ్యక్తులు వాహనాల ద్వారా తెచ్చే నీటిపై ఆధారపడ్డారు. ఒకవేళ వారు సకాలంలో రాకపోతే వీరి పరిస్థితి ఊహించలేనిది. అంతే కాకుండా నివాసాల్లోని యువకులు, పురుషులు వేటకు వెళ్లి ఒక్కోసారి వారం రోజులపాటు సముద్రంలోనే ఉంటారు. ఈ సమయంలో ఇంట్లో ఉన్న వృద్ధులు, మహిళలు తాగునీరు కోసం పాట్లు పడుతున్నారు. మరో వైపు గ్రామంలో అధిక శాతం రోడ్లు శిథిలావస్థకు చేరాయి. రోడ్లు గుంతల మయంగా ఉన్నాయి. పైగా వీధి దీపాలు కూడా పూర్తిగా లేవు. ఈక్రమంలో రాత్రి సమయాల్లో రాకపోక లకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్యం లోపం మెండుగానే ఉంది. చెత్త సేకరణలో అధికారులకు చిత్తశుద్ధి లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వీధుల వెంబడి చెత్త పేరుకు పోయి దుర్వాసనలు వెద జల్లుతున్నాయి. నెలలు తరబడి తాగునీరు లేక అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోలేక పోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు మౌలిక వసతులు కల్పించి ఆదరించాలని గ్రామస్థులు కోరుకుంటు న్నారు.

తాగునీరు లేక ఇబ్బందులు

పంచాయితీకు చెందిన ఆర్వో ప్లాంట్ మూలనపడి నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈక్రమంలో తాగేందుకు నీరు అందక గ్రామంలో పెద్ద చిన్న తేడా లేకుండా అందరం చాలా ఇబ్బందులు పడుతున్నాము. అధికారులు గ్రామస్థులకు తాగు నీరు అందించాలి

రాజేశ్వరి, స్థానికురాలు



మౌలిక వసతుల కల్పనలో చిత్తశుద్ధి లేదు

గ్రామంలో రోడ్లు సక్రమంగా లేవు. వీధి దీపాలు అరకొరగానే ఉన్నాయి. పారిశుధ్యంలో లోపం ఉంది. చెత్త సేకరణ సమస్య చాలా ఉంది. ప్రధాన రహదారులు మినహా వీధుల్లోకి కార్మికులు రావడం లేవు. దీంతో గ్రామంలో సమస్యల వలయంగా మారింది. అధికారులు ప్రజల సమస్యలు పరిష్కరించాలి

వెంకటేశ్వరమ్మ, స్థానికురాలు



పూనూరులో పేకాట డెన్..!

- అక్కడే మద్యం అమ్మకాలు

యద్దనపూడి, (మార్టూరు)జూలై27(ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామంలో ఒక వ్యక్తి తన సొంత స్థలంలోనే పేకాట డెన్‌ను నిర్వహిస్తున్నాడు. యద్దనపూడి, మార్టూరు, గన్నవరం, పూనూరు తదితర గ్రామాల నుంచి పేకాట రాయుళ్లు ఆటకు వస్తున్నారు. ఉదయం 9 గంటల నుండి రాత్రి పొద్దుపోయేవరకు, అవసరమైతే ఆటగాళ్ల కోరిక మేరకు అర్థరాత్రైనా పేకాట నిరాటకంగా కొనసాగడానికి ఈ వ్యక్తి సహకరిస్తున్నాడని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామానికి చెందిన వ్యక్తి, అంతో ఇంతో పలుకుబడి గలిగిన వ్యక్తి కావడంతో అతని సొంత స్థలంలోనే గుట్టుచప్పుడు కాకుండా, ఈ డెన్‌ను ఏర్పాటుచేయడంతో, ఆటగాళ్లు కూడా రహస్యంగా ఆటకు వస్తున్నట్లు తెలిసింది. గ్రామంలో ఈ విషయం చాలా మందికి తెలిసినప్పటికీ, చూసిచూడనట్టే వదిలేస్తున్నారు. అయితే పేకాట జరుగుతున్న సమయంలో ఆటగాళ్ల నుంచి ఆటకు వంద రూపాయలవంతున అతను వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పుడిప్పుడే ఈ గ్రామంలో పేకాటకు వెళితే ఎలాంటి బెడద ఉండదని, క్షేమంగా ఆడుకుని, కుదిరితే నాలుగు రూపాయలు జేబులో వేసుకొని రావచ్చునని చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ఆటగాళ్లు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఆటగాళ్లకు ఆటమధ్యలో ఆటవిడుపుగా వీరికి అందుబాటులో ఉండేలా మద్యం, అక్కడే ఒక వ్యక్తి అమ్మకాలు కూడా చేపట్టేవిధంగా డెన్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిసింది. అందుకు మద్యం అమ్మకాలు చేసే వ్యక్తి రోజుకు రూ.500 దాకా 'డెన్ రాజా'కు సమర్పించుకున్నట్లు సమాచారం. గ్రామానికి దూరంగా ఎక్కడో చెట్లలో, గుట్లలో పేకాట జరగడం చూశాంగాని, గ్రామంలోనే ఇలాంటి వాతావరణం ఎప్పుడూ చూడలేదని పలువురు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పేకాట ఆడటానికి వచ్చే ఇతర గ్రామాల నుండి కాని, పూనూరు గ్రామానికి చెందిన వ్యక్తులు నుంచిగాని, క్షణికావేశంలో ఏమైనా గొడవలు జరిగితే బాధ్యులు ఎవరని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.

బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

పంగులూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పవరం గ్రామంలో బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక టీడీపీ నేతలు ఆదివారం ప్రారంభించారు. 16వ నంబరు జాతీయ రహదారి నుంచి ముప్పవరం గ్రామానికి ఉత్తరం వైపుగా, ఇంకొల్లు, అద్దంకి రోడ్డును కలుపుతూ ఈ బైపాస్ రోడ్డు నిర్మిస్తున్నారు. ఒకటిన్నర కిలోమీటర్ పొడవున డబుల్ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ రూ.3 కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరు చేయించారు. నిర్మాణ పనుల ప్రారంభ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఏడుకొండలు, డీసీ చైర్మన్ కుక్కపల్లి ఆంజనేయులు, జె.వి.పాలెం పీఏసీఎస్ అధ్యక్షులు అల్లంనేని బ్రహ్మానందస్వామి పాల్గొన్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ముప్పవరం ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్య తీరుతుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బాలయోగి గోశాలలో అగ్ని ప్రమాదం

- సుమారు 20 ఎకరాల గడ్డివాము దగ్ధం

వేటపాలెం (చీరాల), జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మండలం పరిధిలోని చల్లారెడ్డిపాలెం బాలయోగి ఆశ్రమంలో అగ్నిప్రమాదం చోటుచేసుకొంది. అకస్మాత్తుగా అందులోని గోశాల గడ్డివాముల నుంచి మంటలు చెలరేగాయి. దీంతో 20 ఎకరాలు గడ్డివాము అగ్రికి ఆహుతైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు శ్రమించాల్సి వచ్చింది. ప్రమాదంలో సుమారు రూ.2 లక్షలు నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు.

42మందికి ఉద్యోగావకాశాలు

మద్దిపాడు, జూలై 27(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 42మందికి ఉద్యోగావకాశాలు లభించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రవితేజయాదవ్ తెలిపారు. మిడ్‌వెస్ట్, హెటీరో, సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ వంటి సంస్థలు హాజరయ్యాయి.

శనగ అ'ధర'గా..

(5వ పేజీ తరువాయి)

ప్రస్తుతం 19 వేల హెక్టార్లకు పడిపోయింది. చీడపీడల బెడద, ప్రకృతి విపత్తుల కారణాలతో చాలా మంది రైతులు శనగ సాగుకు స్వస్తి చెప్పారు.

మార్క్‌ఫెడ్‌కు క్వింటా కూడా రాలేదు...

గతంలో మార్క్‌ఫెడ్ శనగ మద్దతు ధర రూ.5,650గా నిర్ణయించింది. కానీ, ఒక్క క్వింటా కూడా రైతులు మార్క్‌ఫెడ్‌కు విక్రయించలేదు. నిబంధనల ప్రకారం ఎర్రశనగను కొనడానికే మార్క్ ఫెడ్‌కు అవకాశం ఉంది. తెల్ల శనగ కొనడానికి వీలు లేదు. ఎర్ర శనగ విషయంలో డీస్టోన్ చేసి అంటే మట్టి పెళ్లలను తొలగించడంతో పాటు శుభ్రం చేసిన వాటినే మార్క్‌ఫెడ్ కొంటుంది. ఇవన్నీ చేయాలంటే రైతుకు క్వింటాకు అదనంగా రూ.600 వరకు ఖర్చయ్యే అవకాశం ఉంది. అంటే మద్దతు ధర నికరంగా అన్నదాతకు చేరేది కేవలం రూ.5,050 కావడంతో రైతులు మార్క్‌ఫెడ్ కొనుగోళ్ల వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ధర కోసం ఎదురుచూడలేని రైతులు రూ.300లు తక్కువకు బయటి మార్కెట్‌లోనే తమ దిగుబడులు అమ్ముకున్నారు. ఆర్థిక వెసులుబాటు ఉన్న రైతులు తమ దిగిబడులను కోల్డ్ స్టోరేజీలో నిల్వ ఉంచుకున్నారు. ప్రస్తుతం పెరిగిన ధర పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.